TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ

ఎడిటర్ : పోలగోని రాజేష్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam | సంపుటి : 2 | సంచిక : 99 | పేజీలు : 8 | శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | వెల : 4/-

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్
పి.వెంకటేష్
9949360937,9100900931

ఆ ఆరుగురు ఎవరు?

కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

నాలుగు పదవుల భర్తీ దిశగా అడుగులు

- హీటెక్కిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్..
- ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం..
- నామినేటెడ్, ఎమ్మెల్సీ స్థానాల భర్తీ, పిసిసి చీఫ్ నియామకం పూర్తవ్వడంతో ప్రస్తుతం అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే పడింది.
- తాను అనుకున్న వారికే ప్రాధాన్యత ఇచ్చేలా హైకమాండ్‌ను ఒప్పించాలని రేవంత్ గట్టి ప్రయత్నాలు

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సిఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. వరద నష్టం అంచనాలకు సంబంధించి కేంద్ర సాయాన్ని కోరనున్నారు. భేటీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షం సృష్టించిన బీభత్సం, అస్తి, ప్రాణ, పంట నష్టాలపై సీఎం రేవంత్ ప్రధాని మోదీకి సమగ్ర నివేదికను అందజేయనున్నారు. దీనికి సంబంధించిన అపాయింట్‌ను ఫిక్స్ అయినట్టుగా తెలుస్తోంది. మరోవైపు ఢిల్లీ పర్యటనలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో నేడు భేటీ కానున్నారు. అదేవిధంగా వరద బాధితుల సహాయార్థం కేంద్రం నుంచి నిధులు విడుదల చేసి ఆదుకోవాలని హోంమంత్రిని కోరనున్నారు. సిఎంతో పాటు ఢిల్లీకి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా వెళ్లారు. పీసీసీ చీఫ్‌గా ఎంపికైన తర్వాత మహేశ్ కుమార్ తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పార్టీ పెద్దలను పీసీసీ చీఫ్ మర్యాదపూర్వకంగా కలవనున్నారు. సీఎంతో మహేశ్ కుమార్ గౌడ్ తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటిస్తున్నారు.

మంత్రవర్గ విస్తరణపై చర్చించే అవకాశం

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియాగాంధీని రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ కలువనున్నారు. సాయంత్రం కాంగ్రెస్ హైకమాండ్‌తో రేవంత్ రెడ్డి చర్చలు జరిపే అవకాశం ఉంది. ఈరోజు క్లారిటీ రాకపోతే.. రేపు కూడా ఢిల్లీలోనే ఉండి ఆరు పేర్లను ఫైనల్ చేయనున్నారు. నామినేటెడ్, ఎమ్మెల్సీ స్థానాల భర్తీ, పిసిసి చీఫ్ నియామకం పూర్తవ్వడంతో ప్రస్తుతం అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే పడింది. డిసెంబర్ 7న సిఎం రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఇంకా ఆరు కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. హోం మంత్రిత్వశాఖ, మున్సిపల్, విద్య, మైనింగ్‌తో పాటు పలు కీలక శాఖలు సిఎం వద్దే ఉన్నాయి. కేబినెట్ విస్తరణలో పలువురు సీనియర్ మంత్రి పదవులు ఆశిస్తున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధాన లక్ష్యం.. కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ తెచ్చుకోవడం. ఇందు కోసంఆయన చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. - మిగతా3లో



సీపీఎం నేత సీతారాం ఏచూరి కన్నుమూత

- కొంతకాలంగా తీవ్ర శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఏచూరి
- 2015లో సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు
- నేషనల్ ఫ్రంట్ , యునైటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర
- సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్ కు దానం చేసిన కుటుంబ సభ్యులు
- వైద్య విద్యార్థులకు బోధనలో భౌతికకాయం ఉపయోగించుకోవాలన్న కుటుంబం
- ఓ ప్రకటన ద్వారా వెల్లడించిన ఢిల్లీ ఎయిమ్స్

పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నమా

- ఇందిరమ్మ రాజ్యం అంటే.. ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా?: కేటీఆర్
- ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉంది

ప్రభుత్వానిదే బాధ్యత

- మెడికల్ అడ్మిషన్లకు స్థానికతపై సుప్రీంకు తెలంగాణ సర్కార్
- స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- దాంతో రూల్స్ సవరించాం
- తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం
- ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది.

ఢిల్లీ

మెడికల్ అడ్మిషన్లకు స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించదన్న ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని - మిగతా3లో

వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయి

- భారత్-చైనా సంబంధాలపై విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- బలగాల ఉపసంహరణకు సంబంధించిన సమస్యలు 75 శాతం పూర్తయ్యాయని వ్యాఖ్య
- సరిహద్దులో చైనా సైనికీకరణ పెరుగుతుండడమే అతిపెద్ద సవాలన్న జైశంకర్
- జెనీవాలో జరిగిన 'జెనీవా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ'లో మాట్లాడిన విదేశాంగ మంత్రి

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదు

- తెలంగాణలో ఉపఎన్నికలపై టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు
- ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయి
- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నాం
- బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతా
- కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత

న్యూఢిల్లీ

తెలంగాణలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ ఖాతాలోనే చేరుతాయని టీపీసీసీ చీఫ్ తేల్చిచెప్పారు. గురువారం ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేను మహేష్ కుమార్ కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 60 ఏళ్ళు రాజకీయాల్లో - మిగతా3లో

రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలి

- రాహుల్ గాంధీ మాట్లాడే మాటలను సంఘ విద్రోహ శక్తులు సమర్థిస్తుంటాయన్న బీజేపీ నేత
- ఉగ్రవాద సంస్థలకు, రాహుల్ గాంధీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అని నిలదీత
- హైడ్రా పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం
- ప్రజా పాలన దినోత్సవం కాదని... విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదు

సీపీఎం నేత సీతారాం ఏచూరి కన్నుమూత

న్యూఢిల్లీ: కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి కన్నుమూశారు. ఆయన వయసు 72 ఏళ్లు. సీపీఎం ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ ఎంపీ అయిన ఏచూరి.. ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు కొన్ని రోజుల నుంచి అక్కడే చికిత్స చేపడుతున్న విషయం తెలిసిందే. శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న ఏచూరి ఇవాళ మరణించినట్లు ఆ పార్టీ ప్రకటించింది.

ఆగస్టు 19వ తేదీన ఎయిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో ఆయన్ను చేర్పించారు. ఆ తర్వాత ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు మార్చారు. 2015లో సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పార్టీ నేత హరికిషన్ సింగ్ సుర్జీత్ వద్ద ఏచూరి ఎదిగారు. వీపీ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ , యునెటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ప్రభుత్వానికి సీపీఎం బయటి నుంచి మద్దతు ఇచ్చింది. తొలిసారి ఏర్పడ్డ యూపీఏ ప్రభుత్వానికి కూడా లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఆ సమయంలోనూ ఏచూరి కీలక పాత్రను పోషించాడు. పాలసీ మేకింగ్‌లో కాంగ్రెస్ పార్టీపై ఆయన వత్తిడి తీసుకొచ్చారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో ఆయన 1974లో చేరారు. ఆ తర్వాత ఏడాదే ఆయన పార్టీ సభ్యుడిగా మారారు. ఎమర్జెన్సీ సమయంలో అతన్ని అరెస్టు చేశారు.

సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్ కు దానం చేసిన కుటుంబ సభ్యులు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేడు కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న ఆయన... ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. కాగా, ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఎయిమ్స్ (ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కు దానం చేశారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల బోధన, రీసెర్చ్ లో ఏచూరి భౌతికకాయాన్ని ఉపయోగించుకోవాలని కుటుంబ సభ్యులు ఎయిమ్స్ ను కోరారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఎయిమ్స్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది.

విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి..

ఏచూరి జీవిత విశేషాలు

వెబ్ డెస్క్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. 32 ఏళ్లుగా సీపీఎం



పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్న ఏచూరి 2015లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2005 – 2017 వరకు బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు.

బాల్యం..

ఆయన పూర్తిపేరు ఏచూరి సీతారామరావు. 1952 ఆగస్టు 12 చెన్నైలో వైదేహి బ్రాహ్మణులైన సర్వేశ్వర సోమయాజులు ఏచూరి,కల్పకం దంపతులకు జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజులు ఏమారి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్‌గా పని చేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారిణిగా ఉండేవారు. ఏచూరి బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది. భాగ్యనగరంలోని అల్ సెయింట్స్ హైస్కూల్లో ఆయన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అనంతరం అక్కడే పీహెచ్‌డీలో చేరారు. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించడం.. ఏచూరిని అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీ కొనసాగించలేకపోయారు.

దాంపత్య జీవితం..

సీతారం ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. ఆయన మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా.. జర్నలిస్టు సీమా చిత్తీ రెండో భార్య. ఏచూరి రెండో భార్య సీమా చిస్తీ జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. మొదటి భార్యకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. అయితే కుమారుడు ఆశిష్.. 2021 ఏప్రిల్ 22న కొవిడ్‌తో మరణించారు.

రాజకీయ రంగ ప్రవేశం ఇలా..

తప్పు జరిగితే సహించలేని మనస్థత్వం ఏచూరిది. అందుకే

చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే కుతూహలం ఉండేది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఎంలో చేరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ బాధితుల్లో ఏచూరీ కూడా ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. జేఎన్‌యూ విద్యార్థి సమాఖ్యకు ఏచూరి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1990లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, 2005లో వెస్ట్ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళ విప్లవ సూర్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కి ఏచూరి అత్యంత సన్నిహితుడు.

ప్రస్తుత రాజకీయాల్లో..

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక రాజకీయాల ముఖస్వరూపం మారిపోయింది. అయితే ప్రస్తుత రాజకీయాలకు కావాల్సిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటూ ఏచూరి ఎదుగుతూ వచ్చారు. కొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాల్లో కీలకంగా ఉన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి చిదంబరంతోపాటు ఏచూరి కీలక భూమిక పోషించారు. 2004లో అప్పటి యూపీఏ సర్కార్ నిర్మాణంలోనూ ఏచూరిది ప్రముఖ పాత్ర అని చెప్పుకోవచ్చు.

ఆర్ జీ కర్ ఆసుపత్రిలో బ్యాగ్ కలకలం..

ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్లు చర్చలు

కోల్‌కతా : ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం ఓ బ్యాగ్ కలకలం సృష్టించింది. సదరు బ్యాగ్‌ను ఎవరు తీసుకు వెళ్లక పోవడంతో ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జాగిలాలతో సహా పోలీసులు ఆర్ జీ కర్ ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలోని బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అయితే ఈ బ్యాగ్‌లో ఏమి లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బందితోపాటు రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిలోని రోగులను బయటకు పంపారు. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలు హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని.. అలాగే వైద్య రంగాన్ని ప్రక్షాళన చేయాలంటూ జూనియర్ వైద్యులు దాదాపు నెలకు పైగా ఆందోళన చేపట్టారు. ఆ క్రమంలో వారితో చర్చించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ రోజు సాయంత్రం అంటే.. సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం 5.00 గంటలకు జూనియర్ డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరపనుంది. అయితే జూనియర్ వైద్యులు డిమాండ్లలో కొన్నింటిని ప్రభుత్వం పక్కన పెట్టింది. సీఎం మమతా బెనర్జీ సమక్షంలో చర్చలు జరిగేందుకు సానుకూలంగా స్పందించింది. అలాగే ఈ చర్చలకు కేవలం 15 మంది మాత్రమే రావాలని షరతు విధించింది. ఈ

చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ జూనియర్ వైద్యుల చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం తొసి పుచ్చింది. కానీ ఈ చర్చలను మాత్రం రికార్డ్ చేస్తామని స్పష్టం చేసింది. అదికూడా పారదర్శకత కోసమేనని ఆ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ తెలిపారు. ఈ మేరకు జూనియర్ వైద్యులకు రాసిన లేఖలో ఈ అంశాలను ఆయన పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదు : ప్రశాంత్ కిషోర్

అమెరికా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటనపై జన్ సురాజ్ చీఫ్, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఏ సమయంలో ఏం మాట్లాడతారో ఆయనకే తెలియదని అన్నారు. కొద్ది నెలల కిందట కుల గణనకు అనుకూలంగా మాట్లాడిన రాహుల్ రిజర్వేషన్లను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారని గుర్తుచేశారు. అయితే అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తుతం రిజర్వేషన్లు తొలగించడం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకూ రాహుల్ నిత్యం కుల గణన చేపట్టాలని, అవసరమైతే కోటా పరిమితిని పెంచాలని అన్నారని, ఇప్పుడాయన ఎందుకు రిజర్వేషన్లు తొలగించాలని మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ప్రశాంత్ కిషోర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రకటనపై కాంగ్రెస్ నేతలు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ దినేష్ శర్మ గురువారం స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్ ఎకానమీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ ఎకానమీగా ఎదిగిందని అన్నారు.

ఇంకెంతకాలం కళ్లు మూసుకుని ఉంటారు?

ఢిల్లీ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యాచార ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నా ఆ పార్టీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని లోక్ సభపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ట్రైనీ ఆర్మీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరవయ్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాలపట్ల బీజేపీ ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి ఆందోళన కలిగిస్తోంది. అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి పనులకు పూనుకుంటున్నారు. ఈ నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారతాయి. దేశ జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారు" అని రాహుల్ ప్రశ్నించారు.

ఏం జరిగిందంటే..

మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్మీ అధికారులు మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్నారు. అధికారులు ఇద్దరూ మధ్యాహ్న సమయంలో మహిళా స్నేహితులతో కలిసి ఛోటీ జామ్‌లోని ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. అయితే వారిని అకస్మాత్తుగా 8 మంది వ్యక్తులు పిస్టల్స్, కత్తులు, కర్రలతో చుట్టుముట్టారు. డబ్బు, నగలు, వస్తువులు దోచుకోవడానికి వచ్చిన దుండగులు ఇద్దరు ట్రైనీ అధికారులను దారుణంగా కొట్టారు. ఒక ఆఫీసర్‌ని, ఒక మహిళను బందీలుగా మార్చుకున్న

దుండగులు.. మరో అధికారిని, ఒక మహిళను వదిలిపెట్టి రూ.10 లక్షలు తీసుకొచ్చి బందీలుగా ఉన్నవారిని విడిపించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వారి చెర నుంచి బయటపడ్డ ఆర్మీ అధికారి వేగంగా తన ఆర్మీ యూనిట్ వద్దకు వెళ్లి విషయాన్ని కమాండింగ్ అధికారికి చెప్పారు. ఇదే సమయంలో డయల్-100 ద్వారా పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పోలీసులు, సైనిక అధికారులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. అయితే వాహనాలను ముందుగానే గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు నలుగురినీ వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు ఆర్మీ అధికారులకు గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. ఒక మహిళపై అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు బద్గొండ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ లోకేంద్ర సింగ్ హిరోర్ చెప్పారు.

వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయి

చైనాతో సంబంధాలు, సరిహద్దు వివాదంపై విదేశాంగ మంత్రి జైశంకర్ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీ ఇంటరాక్టివ్ సెషన్‌లో మాట్లాడారు. చైనాతో దాదాపు 75శాతం సమస్యలు పరిష్కామయ్యాయని.. సరిహద్దుల్లో సైనికీకరణ పెరగడం పెద్ద సమస్యగా అభివర్ణించారు. జూన్ 2020లో గాల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణలు భారత్-చైనా సంబంధాలను ప్రభావితం చేశాయన్నారు. సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని.. కొంత వరకు పురోగతి సాధించామని చెప్పారు. బలగాల ఉపసంహరణకు సంబంధించిన సమస్యలు 75 శాతం పరిష్కారం అయ్యాయని తాను చెప్పగలనని.. చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వివాదాన్ని పరిష్కరించుకుంటే సంబంధాలు మెరుగుపడుతాయ్నారు. పరిష్కారం దొరికితే శాంతి, సామరస్యం నెలకొంటుందని.. ఆ తర్వాత ఇతర అవకాశాలను సైతం పరిశీలింవచ్చన్నారు. తూర్పు లడఖ్‌లోని పలుచోట్ల భారత్ %-% చైనా మధ్య ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, రెండువైపులా విస్తృతమైన దౌత్య, సైనిక చర్చల తర్వాత అనేక ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించారు. అదే సమయంలో రాబోయే రోజుల్లో అమెరికాలో క్వాడ్ సమ్మిట్ జరుగుతుందని భావిస్తున్నామని, కాలం గడుస్తున్న కొద్దీ ఇండో-పసిఫిక్‌లోని చాలా ప్రాంతాల్లో విశ్వాసం పెరుగుతోందని జైశంకర్ పేర్కొన్నారు. "చర్చలు కొనసాగుతున్నాయి. కొంత మేర మేము పురోగతిని సాధించాం. చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయి" అని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన స్పందించారు. సరిహద్దులో సైనికీకరణ సమస్యను పరిష్కరించాలని భావించామని, అయితే ఈలోగా గాల్వాన్ ఘర్షణ జరగడంతో మొత్తం సంబంధాలు ప్రభావితం అయ్యాయని అన్నారు. వివాదానికి పరిష్కారం లభిస్తేనే సంబంధాలు మెరుగుపడతాయని జైశంకర్ వ్యాఖ్యానించారు. సమస్యకు పరిష్కారం లభించి శాంతి నెలకొంటే తాము ఇతర అవకాశాలపై దృష్టిసారిస్తామని చెప్పారు.

లాలూ ప్రసాద్ యాదవ్‌కు యాంజియోప్లాస్టీ చేసిన ముంబయి వైద్యులు..

బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. లాలూ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేరారు. యాంజియోప్లాస్టీ చేయించుకోవాలని కార్డియాలజిస్టులు మాజీ సీఎంకు సూచించగా ఆయన అంగీకరించారు. ఈ క్రమంలో గురువారం వైద్యులు యాంజియో ప్లాస్టీ చేశారు. లాలూ గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. గతంలో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన కుమార్తె కిడ్నీ దానం చేసిన విషయం తెలిసిందే. లాలూ ప్రసాద్ యాదవ్ ల్యాండ్ ఫర్ స్కామ్, దాణా కుంభకోణం కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలతో ఆయన నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 10న ఆయన ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైద్య పరీక్షల తర్వాత ఒకటి, రెండురోజుల్లో డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. 2014లో లాలూకు ఇదే ఆస్పత్రిలో అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ జరిగింది. 2018, 2023 అదే ఆసుపత్రిలో పరీక్షల కోసం వచ్చారు. సతోష్ దొరా నేతృత్వంలోని వైద్యబృందం చికిత్స అందిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నవంబర్ 2022లో లాలూ కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆయనకు కూతురు రోహిణి కిడ్నీ దానం చేశారు. రోహిణి సింగపూర్‌లో నివాసం ఉంటున్నారు. చాలాకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో పోరాడుతుండగా.. నిపుణుల సూచన మేరకు కిడ్నీ మార్పిడికి ఆయన అంగీకరించారు. కూతురు రోహిణి కిడ్నీ సరిపోలడంతో సింగపూర్‌లోనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు.

సీజేఐ ఇంట ప్రధాని మోదీ.. రేగిన వివాదం

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దీనిపై మహారాష్ట్రకు చెందిన శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. సీజేఐ ఇంటికి ప్రధాని మోదీ వెళ్లడంతో న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమయ్యే అవకాశముందని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకుడితో రాజ్యాంగ సంరక్షకుడు సమావేశం కావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ వ్యాఖ్యలతో సీజేఐ నివాసానికి ప్రదాని మోదీ వెళ్లడం వివాదాస్పదంగా మారింది. శివసేన ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. గణపతి పూజా వేడుకల్లో మాత్రమే ప్రధాని మోదీ పాల్గొన్నారని స్పష్టం చేసింది. ఇది మన సంస్కృతిలో భాగమని ఈ సందర్భంగా వివరించింది. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని నిజమైన శివసేన పార్టీగా గుర్తిస్తూ మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే శిబిరం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారణకు వచ్చే సమయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం నుంచి తప్పుకోవాలని సీజేఐకి ఎంపి ఏకనాథ్ షిండే సూచించారు. అంతేకాదు.. ప్రతిపక్షాలను వ్యతిరేకంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల జాబితాను తన ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. అందులో కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం, మద్యం కుంభకోణం మనీల్యాండరింగ్ వ్యవహారంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అంశాలను సైతం పొందు పరిచారు. ఈ కేసులన్నీ వరుస క్రమంలో ఓ పద్ధతి ప్రకారం అర్థం చేసుకుంటే అన్ని అర్థమవుతాయన్నారు. ఇదే అంశంపై శివసేన ఎంపీలు ప్రియాంక చతుర్వేది, మిలింద్ దేవరలు సైతం కాస్తా ఘాట్టు స్పందించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ నివాసంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం టోపీ ధరించి ప్రధాని మోదీ ఈ వేడుకలకు హాజరయ్యారు. అందుకు సంబంధించిన ఫోటోలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్ట్ చేశారు. ఈ వేడుకలకు విచ్చేసిన ప్రధాని మోదీని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులు సాదరంగా ఆహ్వానించారు.

రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలి

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రజా పాలనపై కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్... రేవంత్ రెడ్డి సేమ్ టు సేమ్ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ దేశాన్ని వదిలి వెళ్లిపోవాలని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇటాలియన్ పార్టీ అని ఆరోపించారు. బండి సంజయ్ నేడు హైదరాబాద్‌లోని రాంగోపాల్‌పేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడే మాటలను దేశద్రోహ, సంఘ విద్రోహ శక్తులు సమర్థిస్తుంటాయని, ఇలా సమర్థించడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఉగ్రవాద సంస్థలకు, రాహుల్ గాంధీకి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల నుంచి దృష్టి మరల్చేందుకు హైడ్రా పేరుతో నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. పేద ప్రజల పట్ల హైడ్రా వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. నాడు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు, ప్రభుత్వ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అస్సలు తేడా లేదని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17పై సీఎం రేవంత్ రెడ్డి మాట మార్చటం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారంటీలను డైవర్ట్ చేయటానికే హైడ్రా పేరుతో డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు.

ప్రజా పాలన దినోత్సవం కాదని... విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. రైతులను నడ్డి విరచటమే కాంగ్రెస్ ప్రజ పాలన అంటూ వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగులను మోసం చేయటమే కాంగ్రెస్ ప్రజాపాలన అని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొట్టుకోవటమే ప్రజా పాలన అని అన్నారు. విదేశాల్లో భారతదేశంపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. టెర్రరిస్టులతో రాహుల్ గాంధీకి సంబంధాలున్నాయని ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ కంట్రోల్‌లో ఉంటే 500 ఎంపీ సీట్లు గెలుచుకునేవాళ్ళమని తెలిపారు. సిక్కులను ఊచకోత కోసిందే రాహుల్ గాంధీ కుటుంబం అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ విరుచుకుపడ్డారు.

ప్రభుత్వానిదే బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

హైకోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది మెన్షన్ చేశారు. త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం వెల్లడించింది.

తెలంగాణ హైకోర్టు తీర్పిదే...

కాగా... తొమ్మిదో తరగతి నుంచి వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివిన వాళ్లే.. రాష్ట్రంలో వైద్య విద్యకు స్థానిక కోటాలో అర్హులంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలపై హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. తెలంగాణలో శాశ్వత నివాసితులకు ఈ నిబంధన వర్తించదని పేర్కొంటూ.. 'తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్-2017'కు జీవో 33 ద్వారా ప్రభుత్వం తెచ్చిన సవరణ, రూల్ 3(ఏ)ని పునర్నిర్వచించింది. శాశ్వత నివాసులు కేవలం రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటే.. స్థానికులు కాకుండా పోబోరని అభిప్రాయపడింది. శాశ్వత నివాసులైన విద్యార్థులను గుర్తించి, వారికి మెడిసిన్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. తెలంగాణలో వైద్యవిద్యలో అడ్మిషన్లకు ప్రభుత్వం 2017లో నిబంధనలను రూపొందించింది. అయితే.. విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగియడంతో.. ఆ నిబంధనలకు సవరణలను తీసుకొస్తూ.. సర్కారు జూలై 19న జీవో 33ని తీసుకువచ్చింది. దీని ప్రకారం.. తొమ్మిదో తరగతి నుంచి



ఇంటర్ సెకండియర్ వరకు వరుసగా తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు అని రూల్ 3(ఏ)లో నిర్వచించింది. అయితే.. ఇంటర్‌తోపాటు నీట్ కోచింగ్, ఇతరత్రా కారణాల వల్ల వేరే రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ శాశ్వత స్థానికులైన విద్యార్థుల పాలిట ఈ నిర్వచనం శరాఘాతంగా మారింది. సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోవడంపై 130 మందికి పైగా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. 53 వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. "తెలంగాణ స్థానికులమే అయినా.. కేవలం ఒకట్రెండేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కాంపిటెంట్ కోటాలో 85% సీట్లకు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించడం చెల్లదు" అని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావుల ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రావు వాదనలను వినిపించారు. "ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు ముగియడంతో.. తెలంగాణ లోకల్ ఏరియాగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ స్థానికులకు స్థానిక కోటా సీట్లు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దాంతో రూల్స్ సవరించాం. తెలంగాణ శాశ్వత నివాసితులకే స్థానిక రిజర్వేషన్ దక్కడం రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం" అని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. "ప్రభుత్వం సవరణ ద్వారా తీసుకొచ్చిన రూల్ 3(ఏ) ముఖ్యఉద్దేశం స్థానికులకు రిజర్వేషన్ కల్పించడం. ఈ నిబంధనను కొట్టివేస్తే.. తెలంగాణ రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలకు దేశంలోని ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా అర్హులవుతారు. ఇక్కడి శాశ్వత నివాసితులకు స్థానిక రిజర్వేషన్ దక్కకుండా పోతోంది. అందుకే.. ఈ నిబంధనను పునర్నిర్వచిస్తున్నాం. తెలంగాణ శాశ్వత నివాసులకు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వర్తించదని అన్వయిస్తున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 డీ(2), బీ(2)లో పేర్కొన్న ముఖ్య ఉద్దేశానికి అనుగుణంగానే.. ప్రభుత్వం తెచ్చిన నిబంధన 3(ఏ)ని నిర్వచిస్తున్నాం" అని వ్యాఖ్యానించింది. నీట్ విద్యార్థులు తెలంగాణలో శాశ్వత నివాసితులు అయితే.. ఆ మేరకు నివాస ధ్రువీకరణ పత్రాలుంటే.. వారు వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానిక కోటాకు అర్హులేనని స్పష్టం చేసింది. శాశ్వత నివాసితులను గుర్తించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకాలు లేవని గుర్తుచేసింది. ఒక విద్యార్థిని ఏయే పరిస్థితుల్లో శాశ్వత స్థానికుడిగా పరిగణనలోకి తీసుకుంటారనే అంశాన్ని నిర్వచిస్తూ.. కొత్తగా నిబంధనలు లేదా మార్గదర్శకాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త మార్గదర్శకాల మేరకు ప్రవేశాలు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఆ ఆరుగురు ఎవరు..?

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతోంది. పాలన గాడిలో పెట్టుకుంటున్నారు. ఈ సమయంలో కీలకమైన హోం, విద్య వంటి శాఖలకు పూర్తి స్థాయి మంత్రులు లేరు. విధేయులకు ఆ పదవులు కట్టబెట్టి మరింత దూకుడుగా వెళ్లాలని రేవంత్ అనుకుంటున్నారు. కానీ సీనియర్లు రకరకాల కాంబినేషన్లతో తెర ముందుకు వస్తూండటంతో.. హైకమాండ్ ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తోంది. తెలంగాణ కేబినెట్‌లో ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో కలిపి పన్నెండు మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరు కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఆశావహులు ఉత్సాహంగా పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయడానికి చూపించడానికి ఖాళీగా ఉంచారు. అందరికీ టార్గెట్లు పెట్టి ఎన్నికల్లో పని చేయించుకున్నారు. వారంతా ఇప్పుడు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆరు స్థానాల్లో భర్తీ చేస్తే.. ఇక పదువులు రావని అసంతృప్తి చెందే వారు ఉంటారు. అందుకే.. ఒకటి, రెండు ఖాళీగా ఉంచి కనీసం నాలుగు మంత్రి పదవుల్నైనా భర్తీ చేయాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. ఇదే టార్గెట్ తో ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.క్యాబినెట్ విస్తరణలో తమకు చోటు దక్కుతుందని పలువురు సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్, వినోద్ తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. దళిత కోటాలో వీరిద్దరిలో ఒకరికి అచేచ అవకాశం ఉందని చెబుతున్నారు. మంచిర్యాల నుంచి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తమ సీనియార్టీని గుర్తిస్తారని ఎదురు చూస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి ..తమ తమ జిల్లాల్లో తామే ఉండటాన్ని ప్లస్ పాయింట్ గా ఎంచుకుంటున్నారు. వీరితో పాటు నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అజారుద్దీన్ మంత్రి పదవుల కోసం.. హైకమాండ్ వద్ద తమ పలుకుబడిని ఉపయోగించుకుంటున్నారు. ఎవరికి చాన్స్ వస్తుందా అన్నది సస్పెన్స్ గానే ఉంది. రేవంత్ రెడ్డి తనకు విధేయులుగా ఉండేవారిని.. పాలనలో తన వేగాన్ని అందుకునే వారిని.. సామాజిక సమీకరణాల్ని చూసుకుని కొన్ని పేర్లు రెడీ చేసుకున్నారు. గతంలోనే ఆయన ఆ జాబితా సమర్పించారు. కానీ ఇతర సీనియర్ నేతల అభ్యంతరాలతో గ్రీన్ సిగ్నల్ రాలేదు. గతంలో ఆగిపోయినా.. తాను అనుకున్నట్లుగానే మహేష్ కుమార్ గౌడ్ కు పీసీసీ చీఫ్ పదవి ఇప్పించుకున్నట్లుగానే మంత్రి పదవుల విషయలోనూ తాను అనుకున్న వారికే ప్రాధాన్యత ఇచ్చేలా హైకమాండ్ ను ఒప్పించాలని రేవంత్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తాం.. పార్టీ మారిన నేతలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్ : ఐదేండ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పుడు పార్టీ మారిన నేతల సంగతి అప్పుడు చూస్తాం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐదేండ్ల తర్వాత కేసీఆర్ సీఎం కావడం ఖాయం.. మీ భరతం పట్టడం ఖాయం. ఇది రాసిపెట్టుకోండి. ఇప్పుడు పార్టీ మారిన వారందరికీ నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తాం. ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం ఆనవాయితీ.. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షానికి ఇచ్చాం. ఇప్పుడు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ దాఖలు చేసిన నామినేషన్లు ఏమయ్యాయి. నామినేషన్ దాఖలు చేయని అరికెపూడి గాంధీకి దొంగచాటున పీఏసీ ఎలా ఇస్తారని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. అరికెపూడి గాంధీ మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. మైనంపల్లి హన్మంత్ రావు అల్వాల్‌లో మీటింగ్ పెట్టి ఇదే విధంగా కేటీఆర్‌ను దూషించారు. 50 వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. రేపు నీ నియోజకవర్గంలో నీకు కూడా అదే గతి పడుతుంది. ఉప ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో మా దమ్మేందో చూపిస్తాం. ఏదో తిట్టి డైవర్షన్ చేయడం కాదు.. సూటిగా అడుగుతున్నా సమాధానం చెప్పాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

నాపై హత్యాయత్నం.. ప్లాన్ ప్రకారమే గూండాలతో దాడి: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ గూండాలు తనపై హత్యాయత్నం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. తన ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని చెప్పారు. ప్లాన్ ప్రకారమే గుడ్లు, టమాటాలు తీసుకొచ్చారని తెలిపారు. దాడులు చేస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. చంపే ప్రయత్నం చేస్తే.. మేమేందో కూడా చూపిస్తామన్నారు. గూండాలతో వచ్చి దాడి చేయడం ఎంతవరకు కరెక్టు అని ప్రశ్నించారు. హారతులతో స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంటే.. తమపై రాళ్ల దాడులు చేస్తారా అన్నారు. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేదని, సామన్య ప్రజలకు ప్రభుత్వం రక్షణ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ఇదేనా రేవంత్ రెడ్డి అని నిలదీశారు. కాంగ్రెస్ గూండాల దాడికి రేపు ప్రతిచర్య ఉంటుందన్నారు. తెలంగాణ పవర్ చూపిస్తామని హెచ్చరించారు. పోలీసులపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఎందుకు అదుపు చేయలేదని ప్రశ్నించారు. తనపై దాడి జరుగుతుంతే చూస్తూ ఉండిపోయారన్నారు. పోలీసులే దగ్గరుండి తనపై దాడి చేయించారని ఆరోపించారు. తన ఇల్లు ధ్వంసం చేస్తుంటే అడ్డుకోలేకపోయారని విమర్శించారు. ఐదేండ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పుడు పార్టీ మారిన నేతల సంగతి అప్పుడు చూస్తాం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐదేండ్ల తర్వాత కేసీఆర్ సీఎం కావడం ఖాయం.. మీ భరతం పట్టడం ఖాయం. ఇది రాసిపెట్టుకోండి. ఇప్పుడు పార్టీ మారిన వారందరికీ నాలుగేండ్ల తర్వాత సినిమా చూపిస్తాం. ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం ఆనవాయితీ.. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షానికి ఇచ్చాం. ఇప్పుడు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ దాఖలు చేసిన నామినేషన్లు ఏమయ్యాయి. నామినేషన్ దాఖలు చేయని అరికెపూడి గాంధీకి దొంగచాటున పీఏసీ ఎలా ఇస్తారని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. అరికెపూడి గాంధీ మాట్లాడిన మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. మైనంపల్లి హన్మంత్ రావు అల్వాల్‌లో మీటింగ్ పెట్టి ఇదే విధంగా కేటీఆర్‌ను దూషించారు. 50 వేల ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. రేపు నీ నియోజకవర్గంలో నీకు కూడా అదే గతి పడుతుంది.

విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం... హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్

రూ.261 కోట్ల విద్యుత్ బకాయిల చెల్లింపుపై వివాదం

విద్యుత్ కొనుగోలు బిడ్‌లో డిస్కంలు పాల్గొనకుండా అడ్డుకున్న డిస్పాచ్ సెంటర్

దీంతో హైకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం

బీఆర్ఎస్ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. బకాయిలు చెల్లించకపోవడంతో తెలంగాణ డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. రూ.261 కోట్ల బకాయిలు చెల్లించాలని పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో డిస్కమ్‌లను నేషనల్ డిస్పాచ్ సెంటర్ అడ్డుకుంది. విద్యుత్ కొనుగోలు బిడ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్ వాదనల కోసం హైకోర్టుకు వెళ్లారు. విద్యుత్ బకాయిల చెల్లింపులకు సంబంధించి చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. మరోవైపు, తెలంగాణ డిస్కమ్‌లు ఈ విషయమై సీఈఆర్సీని ఆశ్రయించాయి.

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

ఉన్న మహానాయకుడు ఏఐసీసీ అధ్యక్షుడిగా ఉన్నారని.. ఖర్గేను కలిసి ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని కాంగ్రెస్ బలోపేతానికి పనిచేయాలని ఖర్గే సూచన చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్త మొదలుకొని సీనియర్ నాయకులను కలుపుకొని వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన స్థానాలకంటే ఎక్కువ సాధించి మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయబోతున్నామన్నారు. మంత్రివర్గ విస్తరణ గురించి సీఎం, ఏఐసీసీ పెద్దలు మాట్లాడారని.. వారే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటు అయ్యేంత వరకు పాత కమిటీలు పనిచేస్తాయన్నారు. బాధ్యతలు చేపట్టాక కొత్త కార్యవర్గంపై అధిష్టానంతో చర్చలు జరుపుతానని చెప్పారు. ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చారని.. సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కమిటీల్లో అన్ని సామాజికవర్గాలకు సముచిత ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు సమయం ఇచ్చిందని... మరికొంతమంది పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కేటీఆర్ సవాళ్ళను పట్టించుకునే స్థితిలో లేరని... ప్రతిపక్ష పాత్ర ఇస్తే దాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించే స్థితిలో లేరని విమర్శించారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అలాగే అరికపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని.. సాంకేతికంగా ఆయనకు పీఏసీ చైర్మన్ ఇచ్చామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా

హైదరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యేపై హత్యాయత్నామా అని ప్రశ్నించారు. మన రాష్ట్రం ఎటు పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్షన్, రౌడీ రాజకీయాలకు తెలంగాణను అడ్డాగా మార్చేస్తుంటే బాధగా ఉందన్నారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్భంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గూండాలతో దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమ్మెల్యేలకు కూడా రక్షణ లేకపోవడమేనా అని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయపరంగా పోరాడుతున్నందునే కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేశారన్నారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించిన దాడేనని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇలాంటి ఉడుత ఊపుల దాడులకు బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఇంతకు మించిన ప్రతిఘటన తప్పదంటూ కేటీఆర్ హెచ్చరించారు.

సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత.. హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్

సైబరాబాద్ సీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకున్నది. సీపీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని శంషాబాద్ పీఎస్‌కు తరలిస్తున్నారు. అయితే, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని విడుదల చేయడంపై బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం తెలిపారు. గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేశారు. అరెస్టు చేయకపోతే కోర్టు వెళ్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంపై ఎమ్మెల్యే గాంధీ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే. కౌశిక్‌రెడ్డి ఇంటిపై కోడి గుడ్లు, టమాటాలు విసిరేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కుర్చీలతో దాడికి దిగారు. ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి వచ్చిన గాంధీని పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అయితే, దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ సీపీ ఆఫీస్ వద్ద ఆందోళనకు దిగింది. కౌశిక్ రెడ్డిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని హరీశ్ రావు సహా బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దాడిని ప్రోత్సహించిన సీఐ, ఏసీపీలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టులకు దిగారు. బీఆర్ఎస్ నేతలను ఈడ్చుకుంటూ వాహనాల్లో పడేశారు. ఈ క్రమంలో హరీశ్‌రావును పోలీసులు లాక్కువెళ్లేందుకు ప్రయత్నించగా హరీశ్‌రావు కిందపడిపోయారు. ఈ క్రమంలో ఆయన చేతికి గాయమైనట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే...

కౌశిక్ రెడ్డి మీద రాళ్లు, టమాటాలతో దాడి: హరీశ్ రావు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో తమ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీద దాడి జరిగిందని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు హరీశ్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఇదేం ప్రజాస్వామ్యం... ఇదేం ప్రజాపాలన... ఇదేం ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంతో పాటు వారినే ఉసిగొల్పి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ విద్రోహ, వికృత, అప్రజాస్వామిక వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

సంపాదకీయం

పెరుగుతున్న నిరుద్యోగం

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ పర్చేసింగ్ పవర్ ప్యారిటీ (పీపీపీ) లెక్కలను బట్టి 3.36 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది.గణనీయంగా పెరుగుతున్న భారతీయ మధ్య తరగతి వృద్ధి వినియోగంలో పెరుగుదలకు దారితీస్తుంది. ఇది అంతర్జాతీయ కంపెనీలను మన దేశంలో పెట్టుబడులు పెట్టేలా ఆకర్షిస్తోంది. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల అంచనాల ప్రకారం 2027 నాటికి అమెరికా, చైనా దేశాల తరువాత మనదేశం మూడో స్థానానికి చేరుకోవచ్చు. అయితే ఉత్సాహం ఉరకలెత్తే యువత చోదకశక్తిగా ఇరవై ఒకటో శతాబ్దంలో ప్రధాన లబ్ధిదారు భారతదేశమేనని విశ్లేషిస్తున్నారు. అయితే భారత్ నిలకడగా అభివృద్ధి సాధించాలంటే నిరుద్యోగం, క్రమంగా తగ్గిపోతున్న యువ జనాభా అనే రెండు ప్రధాన అవరోధాలను సమర్ధవంతంగా అధిగమించాల్సి ఉంటుంది. పారిశ్రామిక వృద్ధిని పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగాలను సృష్టించడం, దిగుమతిపై ఆధారపడటం తగ్గించ డం, జీడీపీ వృద్ధి రేటును పెంచడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదం చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ 2014లో ప్రవేశపెట్టిన "మేక్ ఇన్ ఇండి యా" ఉపాధి కల్పనలో అనుకున్నంతగా సఫలం కాలేదనే చెప్పాలి. ప్రతి సంవత్సరం భారతదేశ కార్మిక మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న లక్షలాది మంది యువకులకు తగిన ఉద్యోగాలు సృష్టించడం దేశ నాయకత్వానికి అతి పెద్ద సవాలుగా మారింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ)లు సంయుక్తంగా రూపొందించిన తాజా నివేదిక ప్రకారం 2011లో 61 శాతంగా ఉన్న శ్రామిక జనాభా, 2021 నాటికి 64శాతానికి చేరిందని, ఇది 2036 నాటికి 65శాతానికి పెరగొచ్చని అంచనా వేశారు. దేశంలోని ప్రతి ముగ్గురు యువకులలో ఒకరికి విద్య, ఉద్యోగం లేదా నైపు ణ్య శిక్షణ లేదని ఇది వెల్లడించింది. పాఠశాల విద్య లేని వారి కంటే ఉన్నత విద్యావంతులైన యువకులలో నిరుద్యోగం ఎక్కువగా ఉందని, చదవడం, రాయడం రానివారిలో నిరుద్యోగిత రేటు 3.4 శాతం ఉంటే, పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు 29.1 శాతంగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. నైపుణ్యాల లేమి, నాణ్యమైన ఉద్యోగాలు లేకపోవడం వల్ల 2022-23లో 15-29 ఏళ్ల మధ్య ఉన్న పట్టణ యువతలో దాదాపు 16% మంది నిరుద్యోగులుగా మిగిలారని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ డేటా చూపిస్తోంది. కానీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఏకానమీ (సీఎంఐఈ) డేటా ప్రకారం యువత నిరుద్యోగ రేటు 45.4% వరకు ఉంది. సీఎంఐఈ సర్వే ప్రకారం, భారత్‌లో నిరుద్యోగిత రేటు 2024 మే నెలలో 7 శాతం నుండి 2024 జూన్ నాటికి 9.2 శాతానికి పెరిగింది. దేశంలోని పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ భారతదేశంలో కూడా నిరుద్యోగిత రేటు పెరుగుతోంది. పట్టణ నిరుద్యోగిత రేటు మేలో 8.6 శాతం నుంచి జూన్‌లో 8.9 శాతానికి పెరిగితే, గ్రామీణ నిరుద్యోగిత రేటు 6.3 శాతం నుంచి 9.3శాతానికి పెరిగింది. లేబర్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్పీఆర్) జూన్‌లో 40.8శాతం నుండి 41.4 శాతానికి పెరగడం, ఉపాధి రేటు 38 శాతం నుండి 37.6 శాతానికి తగ్గడంతో నిరుద్యోగిత రేటు పెరిగింది. దేశంలో నిరుద్యోగిత రేటు విద్యా స్థాయితో పెరుగుతోందని ఐఐఎం లక్నో అధ్యయనంలో కూడా వెల్లడైంది. 2020-21లో నిరక్షరాస్యులు, ప్రైమరీ కంటే తక్కువ చదువుకున్న యువతలో (15-29) నిరుద్యోగ రేటు వరుసగా 0.57%, 1.13% కాగా, ఉన్నత విద్యావంతులలో 14.73% శాతం నిరుద్యోగిత ఉందని తేల్చింది. ప్రస్తుతం శ్రామిక శక్తిలో 35శాతం ఉన్న మహిళా భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాలి. దేశం శ్రామిక శక్తిలో కొనసాగుతున్న లింగ ఆధారిత అసమానతను వీలైనంతగా తగ్గించాలి. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సగటు ఆయుర్దాయం దాదాపు రెట్టింపు కాగా, జనాభా నియంత్రణ తదితర చర్యలతో సం తానోత్పత్తి రేటు తగ్గి బాలబాలికల సంఖ్య తరిగిపోతోంది. కేంద్ర గణాంకాల శాఖ నివేదిక ప్రకారం, 2021లో దేశ జనాభా లో పదిహేనేళ్ల లోపు వారు సుమారు 26 శాతం ఉంటే, 2036 నాటికి వారు 20.1 శాతానికి తగ్గనున్నారు. కాగా అదే సమ యంలో 60 ఏళ్లకు పైబడిన పురుషులు 9.5శాతం నుంచి 13.9శాతానికి, మహిళ లు 10.7 శాతం నుంచి 16 శాతానికి పెరగనున్నారు. 2036 నాటికి దేశంలో బాలబాలికల సంఖ్య తగ్గిపోయి, అరవై ఏళ్లు పైబడిన వారు అధికమవుతారని ఈ నివే దిక వెల్లడించింది. దేశీయ ఉత్పాదకత, సంక్షేమ వ్యయం, కుటుంబ పోషణలపై అత్యంత తీవ్ర ప్రభావం చూపే పరిణామమిది. ఈ పరిస్థితిని అధిగమించడానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తక్షణం ప్రారంభించాలి. దేశ విద్యా విధానం ఆధునిక ప్రపంచ అవసరాలకు తగినట్లు మారనందువలన విద్యా ర్థులు ఆచరణాత్మక నైపుణ్యాలు లేకుండానే ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించి భంగపడుతున్నారు. వచ్చే ఐదేళ్లలో 14.8కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉందని నిపుణులు అంటు న్నారు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ఇటీవలి బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన రూ.2లక్షల కోట్లను సద్వినియోగం చేసే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఇంటర్న్‌షిప్, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి యువతను నేరుగా పరిశ్రమలో చేరేందుకు అనువైన నిపుణ మానవ వనరులుగా తీర్చిదిద్దాలి. భారత్ వృద్ధిరేటు స్థిరంగా కొనసాగుతున్నా ఉద్యోగ కల్పనలో వెనుకపడింది. కాబట్టి కొలువుల సృష్టికి దోహదపడే తయారీ రంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఉపాధి కల్పనలో, ఆర్థికాభి వృద్ధిలో కీలకపాత్ర పోషించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించే విధంగా ప్రభుత్వం విధానాల రూపకల్పన చేయాలి. నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించాలి. ఉపాధి వెతుక్కుంటూ యువత వలస బాట పడుతుండగా గ్రామాల్లో వయోవృద్ధులు ఎక్కు వగా నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పి స్థానికంగా ఉద్యోగాలను సృష్టించడం ద్వారా దీన్ని నివారించి, యువత వలసలను అరికట్టవచ్చు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా యువత సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటే సమ్మిళిత అభివృద్ధి ద్వారా"వికసిత్ భారత్" సాధన అసాధ్యమేమీ కాదు!

విలీనానికి నైజాం విముఖత వైనం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశు డు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్ధూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి,

వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉద్ధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. 1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్ల కు చెందిన ఖాసిం రజ్వి రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది. యథాతథ స్థితికి ఒప్పందం... వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగష్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు. అయినా నైజాం, ఆయన నియమిత సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లోంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.

ఓదార్పుతో మానసిక ఒత్తిడి మటుమాయం

నేటి వేగవంతమైన జీవనంలో పాఠశాలకు వెళ్లే చిన్నారి విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిళ్లకు గురౌతున్నారు. వీటి నుంచి బయట పడే మార్గం తెలియక అవస్థలు పడుతున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల మరణం, ఆర్థిక సమస్యలు, పరీక్షల్లో తప్పడం, ప్రేమ విఫలం, నిరుద్యోగం, పెళ్లి కాకపోవడం, నమ్మి మోసపోవడం, సొంత ఇంటి నిర్మాణం, కుమార్తెల పెళ్ళిళ్లు, వ్యాపారంలో నష్టాలు, శారీరక అనారోగ్యం... ఇలా పలు కారణాలతో ప్రజలు మానసిక ఒత్తిళ్ల బారిన పడుతున్నారు. వంశపారంపర్యంగా మానసిక జబ్బులకు లోనయ్యే అవకాశాలూ ఉన్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతిని ఓదార్చే పెద్ద దిక్కు లేక నేడు చిన్న సమస్యలకే యువత ఆత్మన్యూనతతో మానసిక సమస్యలకు గురౌతున్నారు. మానసిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తుల్లో కోపం, చిరాకు, భయం, దిగులు, నిద్రలేమి ఉంటాయి. వీటికి తగిన చికిత్సలు పొందకుంటే క్రమేపీ శారీరక రుగ్మతలుగా మారతాయి. సమాజంలో మానసిక ఆరోగ్యం పట్ల, మానసిక వ్యాధుల పట్ల తగినంత అవగాహన లేదని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంట్లో మానసిక జబ్బుతో ఉన్న రోగి ఉంటే దానిని సరిగా గుర్తించకుండా గాలి సోకిందని, చేతబడి చేశారని నమ్మి బాధితులను గుళ్లు, గోపురాలు చుట్టూ తిప్పుతూ జబ్బును నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గర్భిణుల్లో సగటున 10 శాతం మంది, ప్రసవం తరువాత 13 శాతం మహిళలు డిప్రెషన్‌కు గురవుతున్నారు. వర్ధమాన దేశాల్లో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంటోంది. వర్ధమాన దేశాలకు చెందిన 15 శాతం గర్భిణులు, ప్రసవం తరువాత 19.8 శాతం మంది మహిళలు డిప్రెషన్‌కు లోనవుతున్నట్లు తేలింది. పిల్లలు కూడా డిప్రెషన్‌తో బాధ పడుతున్నారని, భారత్‌లో 0.3 నుంచి 1.2 శాతం మంది చిన్నారులు డిప్రెషన్‌తో బాధ పడుతున్నారని, సకాలంలో వారికి మానసిక వైద్యం అందకపోతే అది వారి మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్' 2016లో భారతదేశంలోని 12 రాష్ట్రాల్లో చేసిన సర్వేలో అనేక ఆందోళనకర అంశాలు వెల్లడయ్యాయి. ఈ సర్వే ప్రకారం 2.7 శాతం ప్రజలు డిప్రెషన్ వంటి మానసిక సమస్యలతో సతమత మవుతున్నారు. మన దేశంలో 15 కోట్ల మందికి మానసిక సమస్యల నుంచి ఉపశమనం కోసం సత్వర వైద్య సహాయం అవసరమనీ ఈ సర్వే తేల్చింది. సైన్స్ జర్నల్ లాన్సెట్‌లో 2016లో ప్రచురితమైన ఒక

నివేదిక.. దేశంలో మానసిక వైద్య సహాయం అవసరమైన ప్రతి 10 మందిలో కేవలం ఒక్కరే అలాంటి సేవలు పొందగలుగు తున్నారని చెప్పింది. మరోవైపు భారత్‌లో ఏటా మానసిక సమస్యలతో సతమత మవుతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇది ఇలాగే కొనసాగితే పదేళ్ల తరువాత ప్రపంచంలో మానసిక సమస్యల బారినపడిన వారిలో మూడింట ఒక వంతు భారతీయులే ఉండొచ్చని ఆ నివేదిక అంచనా వేసింది. దిల్లీకి చెదిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అల్లీడ్ సైన్సెస్(ఐహెచ్‌బీఏఎస్) డైరెక్టర్, గత నలభయ్యేళ్లుగా సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నిమిష్ దేసాయ్ "కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, భారత్‌లో పాశ్చాత్తీకరణ శరవేగంగా జరుగు తుండడంతో కొత్త సాంకేతికతల ఆవిర్భావం కూడా ఒత్తిళ్లకు కారణం కావొచ్చు. అందుకే సరైన అభివృద్ధి కావాలా? సరైన మానసిక ఆరోగ్యం కావాలా అన్న ప్రశ్న ఉదయిస్తుంద"న్నారు. మానసికంగానూ ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఇప్పుడు చాలామంది గుర్తించారని వైద్యులు చెబుతున్నారు. అయితే, ఇప్పటికీ సమాజంలో చాలామంది మానసిక సమస్యలకు గురవడాన్ని, దాన్నుంచి బయట పడేందుకు చికిత్స తీసుకోవడాన్ని తప్పు పనిగానే భావిస్తున్నారని, బయటకు చెప్పుకోవడం లేదనీ వైద్యులు చెబుతున్నారు. టీనేజర్లు, యువతను డిప్రెషన్‌లోకి నెడుతున్న కారణాల్లో సోషల్ మీడియా కూడా ఒకటని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. పిల్లలలో కూడా సోషల్ మీడియాలో స్టేటస్ అప్‌డేట్ చేయడం వంటి విషయాల నుంచి అనేక అంశాలు ఒత్తిడి పెంచు తున్నాయి. దేశంలో మానసిక సమస్యలు ఓ వైపు పెరిగిపోతుంటే మానసిక వైద్య నిపుణుల కొరత కూడా అంతకుమించి పెరుగుతోంది. అమెరికాలో సైకాలజిస్టులు, సైకియాట్రిస్ట్‌లు 60 వేల నుంచి 70 వేల మంది ఉండగా భారత్‌లో వారి సంఖ్య 10 వేల లోపే. ప్రస్తుతమున్న అవసరాల పరంగా చూసుకున్నా దేశంలో కనీసం మరో 15 వేల మంది మానసిక వైద్య నిపుణుల అవసరం ఉంది. మానసిక ఒత్తిడిలో ఉన్న వారికి తగిన చేయూతనిచ్చి ఓదార్పు మాటలు చెప్పడం చాలా ముఖ్యం. తగిన ఓదార్పుతో బాధితులు భవిష్యత్తులో డిప్రెషన, ఇతర మానసిక సమస్యలకు గురి కాకుండా రక్షించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఇలా ఓదార్పు నిచ్చే వ్యక్తులు సైకియాట్రిస్టులు కానక్కర్లేదనీ, సొంత కుటుంబ సభ్యులు లేదా మిత్రులు కావచ్చనీ సూచించింది. సైకాలజిస్టులతో పాటు ఆసక్తి ఉన్న సైన్స్ గ్రాడ్యుయేట్లకు తగిన శిక్షణ ఇచ్చి వీరిని మానసిక ఒత్తిడి తగ్గించే విధంగా ప్రథమ చికిత్సలు (కౌన్సెలింగ్) ఇచ్చే నిపుణులుగా వినియోగించు కోవాలని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. మానసిక ఒత్తిడికి గురి చేసే మనస్సే...మానసిక ఒత్తిడిని తగ్గించే ఆయుధంగా కూడా ఉపయోగ పడుతుంది. ఒత్తిడిని పెంచే ఆలోచనలకు స్వస్తి చెప్పి.. మనస్సును ఆహ్లాదపరిచే ఆలోచనలకు రూపకల్పన చేయాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చక్కటి సెలయేరు, పక్షుల కిలకిల రావాలు, సుందర మైన దృశ్యాలను, పచ్చిక బయళ్లను, రంగుల పక్షులను ఊహించుకుంటే మానసిక ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు. ఇదే రీతిలో యోగా, ధ్యానం, సంగీతం, రిలాక్సేషన్ వంటివి కూడా దీనికి బాగా ఉపయోగ పడతాయి. ఒత్తిడిని తగ్గించే మరో మార్గం ఏదో ఒక హాబీని అలవర్చు కోవడం. ప్రతి రోజూ నిర్ణీత సమయంలో వాకింగ్ చేయడం, ఈత కొట్టడం, సైక్లింగ్ చేయడం, చిత్రలేఖనం, చక్కటి సంగీతం వినడం ఎలా ఏదో ఒకటి ఎంచుకోవాలి. పెద్దవారైతే దైవ పూజలో, పుస్తక పఠనంలో గడపవచ్చు. ఒత్తిడిలో ఉన్నప్పుడు, కూర్చువాలి లేదా నిశ్శబ్దమైన, సౌకర్యవంతమైన ప్రదేశంలో పడుకోవాలి. కళ్లను మూసివేసి, ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటూ 5 అంకెలు, ఆపై శ్వాస వదులుతూ 5 అంకెలు లెక్కపెట్టాలి. రిలాక్స్ అయ్యేంతవరకు 5 లేదా 6 సార్లు పై పద్ధతిని పునరావృతం చేయాలి. అప్పుడు ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి అనేది జీవితంలో ఒక తప్పించలేని భాగం, తగ్గించేందుకు కృషి చేయాలి...

గురునానక్ యూనివర్సిటీలో నిర్వహింపబడిన మొదటి ఓరియెంటేషన్ డే

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 13 శాసనసభ న్యూస్ ప్రతినిధి గురునానక్ యూనివర్సిటీ, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్, 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి బ్యాచ్ విద్యార్థులను స్వాగతించడానికి ఈరోజు మొదటి ఓరియంటేషన్ డేని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని జెంటియెన్స్ సిఇఒ శ్రీ బాలాజీ శ్రీనివాసన్ హాజరయ్యారు. ముఖ్య అతిథి తన ముఖ్య ఉపన్యాసంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై తమ అంతఃదృష్టిని పంచుకోవడం మరియు నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను పంచుకోవడం ద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచారు. డిజిటల్ యుగం అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అభివృద్ధి తత్వాన్ని పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. గురునానక్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ మరియు గురునానక్ సంస్థల వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి విద్యార్థులు మరియు తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, గురు నానక్ యూనివర్సిటీలో కొత్తగా చేరిన విద్యార్థులను స్వాగతించారు. గురునానక్ యూనివర్శిటీలో, జ్ఞాన సమీకరణ మరియు ఆచరణాత్మక అనువర్తనానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థులు కేవలం సమాచారాన్ని పొందడమే కాకుండా వాస్తవ-ప్రపంచ దృశ్యాలలో దానిని

ఎలా అన్వయించుకోవాలో తెలుసుకోవడానికి కూడా సహాయ పడుతుందని ఆయన అన్నారు. అలాగే విద్యార్థులందరూ 4 సంవత్సరాల కోర్సును విజయవంతంగా పూర్తి చేసి మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా వారి తల్లిదండ్రులకు, సంస్థకు గౌరవ ప్రతిష్టలు తీసుకురావాల న్నారు. గురునానక్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ మరియు గురునానక్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ హెచ్.ఎస్. సైనీ విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో, గురునానక్ యూనివర్శిటీలో, పరిశ్రమ అవసరాలను తీర్చే విధంగా ప్రాధాన్యతనిస్తూ విద్యారంగ నిపుణులచే పాఠ్యాంశాలను రూపొందించారని చెప్పారు. విద్యార్థులు సంబంధిత జ్ఞానాన్ని, ఆచరణాత్మక నైపుణ్యాలను మరియు వారి సంబంధిత రంగాలలో ప్రస్తుత పోకడలు మరియు సాంకేతికతలను అభివృద్ధి చేసేలా కోర్సులు రూపొందించబడ్డాయి పరిశ్రమ నిపుణుల సమన్వయము ద్వారా, విశ్వవిద్యాలయం దాని పాఠ్యాంశాలను మార్కెట్ డిమాండ్‌లతో సమలేఖనం చేస్తుంది, ఈ విధానం అకాడెమిక్స్ మరియు పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, నేటి పోటీ ఉద్యోగ విఫణిలో అవసరమైన సామర్థ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేస్తుంది. గురునానక్ విశ్వవిద్యాలయం సలహాదారు, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం మరియు మాజీ వైస్-ఛానెలర్ ఆఫ్ జమ్మూ, జమ్మూ %ఉ% కాశ్మీర్ యూనివర్సిటీ, డాక్టర్ మోహన్ పాల్ సింగ్ ఇషార్ కూడా ఈ సందర్భంగా విద్యార్థులు మరియు తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ తాడిశెట్టి శ్రీనివాసులు, గురునానక్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, గురునానక్ యూనివర్సిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎన్ఐటిసి డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనాథరెడ్డి, జిఎన్ఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట్‌రావు, ఇంజినీరింగ్‌లోని వివిధ శాఖల ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు. జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ విశాల్ వాలియా వందన సమర్పణ చేసారు.

అమ్మోరు తోట కాలనీ గణేశుడి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

అన్నదానం నిర్వహించిన గుండె ప్రసన్న రాఘవేందర్ కుటుంబ సభ్యులు

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

ప్రజలందరూ భక్తి భావంతో మెలగాలి

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది..అన్నం పరబ్రహ్మ స్వరూపం

యాచారం , సెప్టెంబర్12 శాసనసభ న్యూస్ ప్రతినిధి ప్రజలందరూ దైవ సన్మార్గంలో నడిచినట్లయితే శాంతి ముక్తి మార్గం లభిస్తుందని గుండె ప్రసన్న రాఘవేందర్ అన్నారు. యాచారం మండలం నందివనపర్తి గ్రామం అమ్మోరు తోట కాలనీ ఆధ్వర్యంలో గత 19సంవత్సరాలుగా కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు చాలా ఘనంగా నిర్వహిస్తుంటారు. నవరాత్రులు ఉత్సవాల భాగంగా ప్రతిష్టించిన గణనాథుడి మండపం వద్ద గుండె ప్రసన్న రాఘవేందర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది .అనంతరం అన్నదానం చేశారు . అన్నదాన కార్యక్రమం నిర్వహించిన గుండె ప్రసన్న రాఘవేందర్ కుటుంబానికి, పూజా కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మూడేడ్ల వెంకటరెడ్డికి శాలుతో కాలనీ వాసులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాలలో అన్నదానం గొప్పదని తెలిపారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అదేవిధంగా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ అన్న ప్రసాదాన్ని గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్క ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.యువత కూడా ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కులమతాలకతీతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక భావంతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవా దృక్పథం అలవడుతుందని,గ్రామాలలో స్నేహ పూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటూ లోక కళ్యాణార్థం, క్షేమం కోసం పూజలు, అన్నదానాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలోనెర్ర శ్రీశైలం, పొలమోని రామకృష్ణ,తెలగమల్ల నరసింహ,పంబాల ఇబ్రహీం, పెరుమళ్ళ యాదయ్య, భూపతి యాదయ్య,రామకృష్ణ, పెరుమల్ల విక్రమ్,శేట్టిమళ్ళ శ్రీకాంత్, తెలగమళ్ల యాదయ్య, ప్రశాంత్,కాలే యాదయ్య, పంబాల అంజయ్య, బిక్షపతి,యాదయ్య, శివాజీ,మరాఠి నర్సింహ,మహేందర్, బండి ఈశ్వర్,అలెగ్జాండర్,గుండె శుభాష్ ,పెరుమళ్ళ రాజు,వంశి,కర్ణకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల పక్కన కోళ్ల ఫారం ఏర్పాటు చేయడం తగదు

దేవరకొండ, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి దేవరకొండ ఆదర్శ పాఠశాలలో సుమారుగా 540 మంది విద్యార్థులతో విద్యాభ్యాసం కొనసాగుతోంది. పాఠశాలలో పక్కనే ఉన్న ఖాళీ స్థలం యజమానులు కోళ్ల ఫారం ఏర్పాటుచేయడం జరిగింది. దీనివల్ల దుర్వాసనతో విద్యార్థిని, విద్యార్థులు అనారోగ్యం పాలై వాంతులు విరోచనాలకు గురవుతున్నారని, తక్షణమే కోళ్ల ఫామ్ తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోళ్లఫామ్ ఎదుట ధర్నాను ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్,సంతోష్, అర్జున్, మైథిలి, శివాని,భాగ్య, పల్లవి,శ్రావణి,శివాని,శిరీష, సంగీత, వెన్నెల,శ్రావణి, శ్రీవాణి, మేఘన, మౌనిక, అనూష, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

దేవరకొండ, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధాకరమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్అన్నారు. సమాజమార్పు కోరే యువతకు ఆదర్శంగా నిలిచిన సీతారాం ఏచూరి. జేఎన్ యు విద్యార్థి నాయకునిగా ఉండి అనేక విధ్యార్థి నాయకులకు స్ఫూర్తి నిచ్చారని, నేను విధ్యార్థి దశలోనే వామపక్ష భావజాలానికి ఆకర్షితుడవడానికి నాకు స్ఫూర్తిదాత సీతారాం ఏచూరి అని మాజీఎమ్మెల్యే ఆయన సేవలను కొనియాడారు. భారతదేశంలో సమసమాజం ఏర్పడాలని ఆశించి, చివరి క్షణం వరకు దానికోసమే పని చేసిన సిద్ధాంతకర్త కామ్రేడ్ సీతారామని, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ శ్రద్ధాంజలి ఘటించారు.

నేలరాలిన ఎర్రమందారం సీతారాం ఏచూరికి ఘన నివాళి..

తుర్కయంజాల్,సెప్టెంబర్ 12(శాసన సభ): సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, పేద ప్రజలకు తీరని లోటని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ అధ్యక్షతన తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తాలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏచూరిది చెరగని ముద్ర అని అన్నారు. విద్యార్థి దశలోనే సీపీఎం విధానాలకు ఆకర్షితులైన ఏచూరి... అంచెలంచెలుగా జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారని అన్నారు. మతతత్వం, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తన గళం విన్పించిన నాయకుడు ఏచూరి అని కొనియాడారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో కాంగ్రెస్, ఇతర పక్షాలతో కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసిన ఘనత ఏచూరికే దక్కిందన్నారు. ఏచూరి మరణం సీపీఎం పార్టీకి, పేదల ప్రజలకు, కార్మిక కర్షకులకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి. జగదీశ్, జిల్లా కమిటి సభ్యులు కే.జగన్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లాకార్యదర్శులు బి.శంకర్, ప్రకాశ్‌కారత్, మండల కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, శ్రీరామమూర్తి, భాస్కర్, కొండిగారి శంకర్, ఆశీర్వాదం, జిల్లా ఆఫీసు కార్యదర్శి విజయ్, ప్రేమాజి, ఐ.కృష్ణ, మాల్యాద్రి, ఎన్.యాదగిరి, పి.మధు, ఎం.యాదయ్య, పల్లె కృష్ణ, సుధాకర్, నర్సింహ, పోటెల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు బుల్లాడ్స్ (వేగ నియంత్రణ సూచికలు) ఏర్పాటు

కొండమల్లెపల్లి, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రోజురోజుకీ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా సిఐ ధనుంజయ ఆదేశాల మేరకు కొండమల్లేపల్లి ఎస్సై మూడు చోట్ల బుల్లర్స్ (వేగ నియంత్రణ సూచికలు) ఏర్పాటు చేసారు. పెండ్లి పాకల ఎక్స్ రోడ్డు, చిన్న అడిశర్లపల్లి సాగర్ హైవే, పోలీస్ స్టేషన్ ముందర ఏర్పాటు చేయనైనదని
కొండమల్లేపల్లి ఎస్ ఐ తెలిపారు.

సీతారాం ఏచూరి అంత్యక్రియలు లేవు

పార్థివదేహాన్ని ఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి దానం.

హైదరాబాద్ ప్రతినిధి (శాసన సభ): రాజకీయ నేత, సీపీఐఎం అగ్రనేత సీతారాం ఏచూరి కన్నుమూసిన విషయం తెలిసిందే. అయితే ఆయనకు అంత్యక్రియలు నిర్వహిం చటం లేదు కుటుంబ సభ్యులు. ఆయన బతికి ఉన్నప్పుడే..తాను చనిపోతే.. తన పార్థివదేహాన్ని వైద్య పరీక్షల కోసం.. వైద్య విద్యార్థుల రీసెర్చ్ కోసం ఉపయోగించు కోవాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి దానం చేయనున్నారు కుటుంబ సభ్యులు. మెడికల్ కాలేజీకి ఆయన పార్థివదేహాన్ని అప్పగించే ముందు.. ఢిల్లీలోని తన ఇంట్లో నివాళులు అర్పించనున్నారు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నేతలు. అనుచరులు. ఇప్పటికే చాలా మంది ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో నివాళులు అర్పించిన తర్వాత.. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించకుండా.. ఆ పార్థివదేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి డొనేట్ చేయనున్నారు కుటుంబ సభ్యులు.

శివాజినగర్ బాలగణేషుడికి ప్రత్యేకపూజలు

చింతపల్లి, సెప్టెంబర్ 13 శాసనసభ న్యూస్ ప్రతినిధి చింతపల్లి మండలం వింజమూరు గ్రామంలోని శివాజీ నగర్ లోని బాల గణేషుడికి గురువారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన గొడుగు శ్వేత శ్రీనివాస్ యాదవ్ . గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బండి గ్రామ ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆ గణనాథుని కోరుకోవడం జరిగింది. అనంతరం పిండి వంటలు, ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు బాలగణేశ్వరి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పోలీసుల విస్తృత తనిఖీలు

చింతపల్లి, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి చింతపల్లి మండల వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి వేడుకల సందడి కొనసాగుతోంది. గణపతి బప్పా మోరియా నామస్మరణతో ఊరూవాడా మారుమోగుతున్నాయి. రంగురంగుల విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులు విశేష పూజలందుకుంటున్నారు. నవరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో మండపాలన్నీ ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు చింతపల్లి ఎస్సై బి యాదయ్య ఆధ్వర్యంలో మండలంలో కొలువుదీరిన గణేష్ మండపాలను ప్రతిరోజు తనిఖీ చేస్తున్నారు. ప్రతినిత్యం వాహనదారులను ఆపి పోలీసులు ముందస్తుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జరగబోయే నిమజ్జనం నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా మద్యం సేవించి వాహనాలు నడపడం, సరైన పత్రాలు లేకపోవడం, గంజాయి, డ్రగ్స్ తదితర

మత్తుపదార్థాలు రవాణా జరుగకుండా ముందస్తుగా వాహన తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు. పోలీస్ సిబ్బంది ఆర్ . సైదులు, స్వరూప్ సింగ్, రాంబాబు, చోటు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

కరీంనగర్ : వరంగల్ కమిషనరేట్ పరిధిలో పీడీఎస్ రైస్ దందా జోరుగా నడుస్తోంది. రేషన్ షాపులతో పాటు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయడం, ఆ తరువాత ఎక్కువ రేటుతో ఇతర రాష్ట్రాలు, కోళ్ల ఫారాలకు తరలిస్తూ కొంతమంది దొడ్డిదారిన బిజినెస్ నడిపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ దందా ఎక్కువ కావడంతో వరంగల్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ అక్రమ దందా స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి రూ.13 లక్షల 41 వేల విలువైన 516 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రాంతంలో కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా అక్రమ దందా చేసే వారికి వర్ధన్నపేట శివారులోని మహేశ్వరి రైస్ మిల్ అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. వరంగల్ పోలీసులకు సమాచారం అందగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు బుధవారం స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి, వాహనాల్లో మహేశ్వరి మిల్కు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వర్ధన్నపేట పోలీసుల సహాయంతో టాస్క్ ఫోర్స్ ఆఫీసర్లు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు పీడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న టీఎస్ 30 టీఏ1851 మహీంద్రా మినీ వాహనాన్ని పట్టుకోగా.. దాని డ్రైవర్ బాలు అనే యువకుడు పోలీసులు కండ్లు గప్పి పారిపోయాడు. అనంతరం మహేశ్వరి రైస్ మిల్లు ఓనర్ కొత్త రాజును అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత మిల్లును

సోదా చెయ్యగా సుమారు 12 లక్షల 48 వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో బియ్యాన్ని సీజ్ చేసి, నిందితుడిని విచారణ నిమిత్తం వర్ధన్నపేట పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.కమిషనరేట్ వెస్ట్ జోన్ పరిధి అయిన జనగామలో బియ్యం దందా అడ్డూఆపు లేకుండా నడుస్తోందనే ఆరోపణలున్నాయి. జనగామ మార్కెట్ ప్రాంతానికి చెందిన రోకళ్ల నాగులు అనే వ్యక్తి రేషన్ బియ్యం దందా చేస్తున్నట్టుగా టాస్క్ ఫోర్స్ పోలీసులు అందగా.. బుధవారం ఉదయం ఆయన ఇంటిపై రైడ్ చేశారు. అక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచగా.. టాస్క్ ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ స్టోర్ చేసి ఉన్న దాదాపు రూ.93 వేల 600 విలువైన 36 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

కాకతీయ భూములపై విజిలెన్స్

వరంగల్ : కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు రెండు రోజులుగా వర్సిటీ చుట్టూ ఉన్న ఆక్రమణలను తేల్చేందుకు సర్వే చేస్తుంది. ముఖ్యంగా సర్వే నెంబర్ 229 భూములలో సర్వే చేసి సరిహద్దు గుర్తించింది. ఇక్కడ ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు రెండు రోజులుగా యూనివర్సిటీ చుట్టూ ఉన్న కబ్జాలు తేల్చే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, గ్రేటర్ వరంగల్ టౌన్ ప్లానింగ్, కాకతీయ యూనివర్సిటీ డెవలప్ మెంట్ ఆఫీసర్స్ తో కలిసి విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్ స్పెక్షన్ చేస్తున్నారు. ప్రధానంగా ఎప్పటి నుంచో ఆరోపణలున్న సర్వే నెంబర్ 229 భూములపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బుధవారం ఆ సర్వే నెంబర్ చుట్టూ పక్కల ఉన్న బౌండరీలను గుర్తించారు. ఆ భూమిలో ఆక్రమణలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో కుమార్ పల్లి, లష్కర్ సింగారం, పలివేల్పుల గ్రామాల పరిధిలోని 673.12 ఎకరాల భూమిని సేకరించారు. కానీ కేయూ క్యాంపస్ చుట్టూ సరైన విధంగా రక్షణ లేని కారణంగా ఆక్రమణలు వెలిశాయి. ముఖ్యంగా కుమార్ పల్లి శివారులోని 229 సర్వే నెంబర్, పలివేల్పుల శివారు 412, 413, 414, లష్కర్ సింగారం శివారు 34 సర్వే నెంబర్ లో కూడా కబ్జాలు జరిగాయనే ఆరోపణలున్నాయిఇదిలా ఉంటే కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ బాబుతో పాటు మరికొంతమంది కుమార్ పల్లి శివారు 229 సర్వే నెంబర్ లోనే ఇళ్లు కట్టుకుని ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతోనే గతంలో వివిధ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టారు. రూ.కోట్లు విలువైన యూనివర్సిటీ భూములను అధికారులే నొక్కేస్తున్నారంటూ నిరసనలు కూడా కొనసాగించారు. ఆ తరువాత అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) అధ్యక్ష, కార్యదర్శులు ప్రొ.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో ఇదివరకు వీసీతో పాటు ప్రజాప్రతినిధులకు విన్నవించారు. గత ప్రభుత్వ పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత మరోసారి ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి కూడా

ఫిర్యాదు చేశారుఅకుట్ ఫిర్యాదుతో పాటు కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ వీసీ వాకాటి కరుణ విజ్ఞప్తి మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు కాకతీయ యూనివర్సిటీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. విజిలెన్స్ సీఐలు రాకేష్, అనిల్ ఆధ్వర్యంలో గత నెల 31వ తేదీన మొదటి దఫా జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించారు. కేయూ అధికారులతో పాటు మున్సిపల్, రెవెన్యూ, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ తదితర శాఖల అధికారులతో కలిసి సర్వే చేపట్టారు.ఇదిలాఉంటే వర్సిటీ భూముల్లో ప్రధానంగా కుమార్ పల్లి శివారు సర్వే నెంబర్ 229 లో కేయూ అధికారి అయిన అశోక్ బాబు ఇల్లు ఉండటంతో ఆఫీసర్లు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్నారు. ముఖ్యంగా ఇదే సర్వే నెంబర్ పై ఆరోపణలు ఎక్కువగా ఉండటంతో రెండు రోజులుగా అదే ల్యాండ్ లో అధికారులు సర్వే జరుపుతున్నారు. మంగళవారం సర్వే నెంబర్ 229 భూమిని పరిశీలించిన విజిలెన్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కేయూ, మున్సిపల్ అధికారులు.. బుధవారం డీమార్కేషన్ చేపట్టారు. ఈ మేరకు సర్వే నెంబర్ 229లో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.ఆఫీసర్లు కబ్జాగా గుర్తించిన సర్వే నెంబర్ 229లో చాలా వరకు ఇళ్లు వెలిశాయి. కాగా బుధవారం జాయింట్ ఇన్ స్పెక్షన్ టీమ్ అధికారులు హద్దులు గుర్తించి మార్కింగ్ వేయడంతో అక్కడ ఇల్లు కట్టుకుని ఉంటున్న వారిలో గందరగోళం మొదలైంది. ఇదిలాఉంటే ఓ వైపు సర్వే జరుగుతుండగా.. మరోవైపు కబ్జా ఆరోపణలున్న ఇళ్ల యజమానులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు నోటీసులు కూడా జారీ చేశారు. దాదాపు 76 మందికి నోటీసులు అందజేశారు. దీంతో అందులో కొంతమంది కోర్టుకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలాఉంటే ఇప్పుడిప్పుడే కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణల వ్యవహారం ఓ కొలిక్కి వస్తుండటంతో భూఆక్రమణ దారుల్లో కలవరం మొదలైంది. కాగా కాకతీయ యూనివర్సిటీ చుట్టూ సమగ్ర భూసర్వే నిర్వహించి, అన్యాక్రాంతమైన భూములను కబ్జా చెర నుంచి విడిపించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలతో పాటు అకుట్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు

రుణాల పేరిట రైతులను మోసం చేసిన సెక్రటరీ

రైతుల పట్టా పాస్ బుక్ ల పై సుమారు కోటి వరకు రుణాలు

రికవరీ కోసం రైతుల ఇంటికి అధికారులు రావడంతో వెలుగులోకి వచ్చిన ఘటన..

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా పడగల్ గ్రామ సహకార సంఘంలో ఐదు సంవత్సరాల క్రితం సెక్రటరీగా విధులు నిర్వహించి ప్రస్తుతం కొలీప్యాక్ లో విధులు నిర్వహిస్తున్న కొత్త దయాకర్ రైతుల వద్ద నుండి వారి అనుమతి లేకుండా పట్టా పాస్ బుక్ లపై క్రాప్ లోన్ తీసుకోవడం జరిగింది లోన్ రికవరీ అధికారులు రైతుల వద్దకు వచ్చి మీ భూమిపై లోన్ ఉందని కట్టని యెడల ఇంటిని వేలానికి వేస్తామని బెదిరించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది మోసపోయామని తెలిసిన బాధితులు పీఏసీసీ పడగల్ ముందర ధర్నా నిర్వహించారు రైతులను నట్టేట ముంచిన సెక్రెటరీ పై చర్యలు తీసుకునేంతవరకు ఉపేక్షించేది లేదని రైతుల భీష్మించుకు కూర్చున్నారు. మా భూములపై తీసుకున్న లోన్లను అధికారులు మాఫీ చేసి బాధితుల తరపున అండగా నిలబడాలని కోరుకున్నారు. పిఏసిసి కి చేరుకున్న విచారణ అధికారి మురళి బాధితుల వాంగ్మూలాన్ని సేకరించి విచారణ చేపడతామని తెలియజేశారు.

నిరుపేద కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అంధజేత - గొప్ప మనసు చాటుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్

యాచారం, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి మాల్ గ్రామానికీ చెందిన యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ నిరుపేద కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి తన గొప్ప మనసును చాటుకున్నారు.మాల్ గ్రామానికి చెందిన గుడుగుంట్ల ముత్యాలు అనారోగ్యంతో బాధపడుతునందున వారి కటుంబానికి ఆర్థిక సహాయం 10 వేల రూపాయలను యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ గురువారం రోజు అందజేసారు.ఈ సందర్భంగా బట్టు శ్రీనివాస్ మాట్లాడుతు ప్రతి నిరుపేద కుటుంబానికి తోడు,నీడగా ఉంటూ వాళ్ళ కుటుంబంలో పెద్దన్నగా,కొడుకుగా ఉంటూ ప్రతి నిరుపేద కుటుంబంలో తన వంతుగా ఆర్థిక సహాయం చేయడం జరుగుతుంది అన్నారు.ప్రతి పేదవాడికి సేవ చేసే గుణం అందరిలో ఉండదు అది కొందరిలో మాత్రమే ఉంటుంది.ధనం కన్నా గుణం గొప్పది అని,తనకు ధనం లేకున్నా,గుణం ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేస్తూ,మా కుటుంబం లాగానే మరెన్నో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసే గొప్ప గుణం ధైర్యం ఆ భగవంతుడు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని ఆర్థిక సహాయం పొందిన గుడుగుంట్ల ముత్యాలు కుటుంబ సభ్యులు అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల జహంగీర్,వి హెచ్ పి ఎస్ అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్,హైస్కూల్ చైర్మన్ గుడుగుంట్ల కృష్ణ,చౌదర్ పల్లి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ గణేష్ ను దర్శించుకున్న శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, కేఎల్ఆర్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి ప్రపంచ ప్రఖ్యాత బాలాపూర్ వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న కాంగ్రెస్ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహా బడంగ్ పేట కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు. మహేశ్వరం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా దీవెనలు ఉండాలని లంబోదరుడిని కోరుకున్నారు మంత్రులు. ప్రజాపాలనలో రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నట్లు కేఎల్ఆర్ తెలిపారు.

హరీష్ రావు అక్రమ అరెస్టును ఖండించిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి పార్టీ మారిన ఎమ్మెల్యేల తీరును ప్రశ్నించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడిని ఖండించిన మాజీమంత్రి హరీష్ రావును అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరంగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆయన మండిపడ్డారు. ప్రజాపాలన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తుందనన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తుందని తెలిపారు. వెంటనే హరీష్ రావును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులతో బీఆర్ ఎస్ ఉద్యమాలను ఆపలేరు

చింతపల్లి,సెప్టెంబర్ 12 శాసనసభ న్యూస్ ప్రతినిధి పార్టీ మారిన ఎమ్మెల్యేల తీరును ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై దాడిని ఖండించినందుకుగాను మాజీ మంత్రి హరీష్ రావును అక్రమ అరెస్టు చేయడంతో హైదరాబాద్ కమీషనరేట్ పోలీస్ ఆఫీసుకు పోయిన టిఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టు చేసినందుకు టిఆర్ఎస్ పార్టీ చలో హైదరాబాద్ పిలుపు ఇచ్చిన నేపద్యంలో దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండల టిఆర్ఎస్ కార్యకర్తలను ముందస్తుగా గురువారం రాత్రి సమయంలో చింతపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించడం జరిగింది. అరెస్ట్ అయిన వారిలో వందనపు ఆంజనేయులు, ఎండి కాలేద్,గునుకుల రమేష్, ఉప్పల యాదయ్య, దాచేపల్లి మధు ఎర్ర వెంకటయ్య ఉన్నారు.

ముగ్గురిపై కత్తులతో దాడి

సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులపై కత్తులతో దాడి జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఘటన జరిగింది. వినాయక చవితి వేడుకల్లో నిమగ్నమైన వడవల్లికి చెందిన ముగ్గురు యువకులపై దాడి జరిగింది. దాడి చేసిన వ్యక్తులు మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న యువకులుగా గుర్తించారు. చిన్న వివాదం చిలికి చిలికి గాలి వానలా మారిన వైనం. తీవ్ర గాయాలైన కరాటే వెంకటేష్, పూర్ణ, రాజమంచి పవన్ కళ్యాణ్ కు సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుల తరపు బంధువులు ఆందోళన చేసారు.

బిజినెస్

టాటా షేర్లు పతనం?

రూ. 825 టార్గెట్ తో యూబీఎస్ నుంచి టాటా గ్రూప్ సంస్థకు 'సేల్' సిఫారసు రావడంతో టాటా మోటార్స్ లిమిటెడ్ షేర్లు బుధవారం (సెప్టెంబర్ 11) ట్రేడింగ్ లో దాదాపు 5 శాతం పతనమయ్యాయి. రేంజ్ రోవర్, డిఫెండర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ప్రీమియం మోడళ్లు, ఇవి టాటా మోటార్స్ యూకే విభాగం సగటు అమ్మకపు ధర (ఎఎస్పీ), స్థూల మార్జిన్ ను పెంచుతున్నాయని బ్రోకరేజీ సంస్థ తెలిపింది. ఆర్డర్ బుకింగ్ కొవిడ్ కు ముందు కంటే దిగువకు పడిపోవడంతో ఈ మోడళ్ల రన్ మోడరేట్ కావడం ప్రారంభమైంది. గతంలో డిఫెండర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ వంటి సంఘటనలను ఉటంకిస్తూ రేంజ్ రోవర్ పై డిస్కౌంట్లు కూడా పెరగవచ్చని విదేశీ బ్రోకరేజీ సంస్థ అంచనా వేస్తోంది. జేఎల్ఆర్ ఆర్డర్ బ్యాక్ లాగ్ ఇప్పటికే ప్రీ కొవిడ్ కంటే తక్కువగా ఉండడం, పెరుగుతున్న బుకింగ్స్ సరఫరాలో వెనుకబడి ఉన్నందున, జేఎల్ఆర్ అపెక్స్ మోడల్ రేంజ్ రోవర్ కు ప్రోత్సాహకాలు సున్నా స్థాయిల నుంచి త్వరలో పెరగడం ప్రారంభిస్తే ఆశ్చర్యపోనవసరం లేదు. పెరుగుతున్న డిస్కౌంట్లు, మోడరేటింగ్ వృద్ధి, కొత్త ఐసీఈ/ హైబ్రిడ్ లాంచ్ లేకపోవడం రెండు సంవత్సరాల ఫలితాలను ఏకాభిప్రాయం అంచనా వేసినప్పటికీ 2026 ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా బలహీనమైన ఆర్థిక పరిస్థితులకు దారితీస్తుంది' అని యూబీఎస్ తెలిపింది. వాణిజ్య వాహనాల (సీవీ) కోసం భారతదేశంలో డిమాండ్ తగ్గుతుండగా, ప్యాసింజర్ వాహనాలు (పీవీలు) వృద్ధి, మార్జిన్ పరంగా తమ ప్రాంతీయ సహచరులను తక్కువగా చూపించడం ప్రారంభించిన సమయంలో జేఎల్ఆర్ వాల్యూమ్ తగ్గింది. బుధవారం బీఎస్ఈలో ఈ షేరు 4.86 శాతం క్షీణించి రూ. 985.15 వద్ద కనిష్టాన్ని తాకింది. జూలై 2023 లో ప్రోత్సాహకాలు పెరగడం ప్రారంభించిన మొదటి మోడల్ డిఫెండర్ అని యూబీఎస్ పేర్కొంది. 2022 లో ప్లాట్ ఫామ్ లకు మార్చిన రేంజ్ రోవర్ స్పోర్ట్ కోసం డిస్కౌంట్లు జూలై, 2024 లో సున్నా నుంచి అకస్మాత్తుగా పెరిగాయి. యూఎస్ లో జేఎల్ఆర్ అత్యధికంగా అమ్ముడవుతున్న మోడల్ కావడం విశేషం. 2022 లో ప్రారంభించిన సమయం, డిఫెండర్ ఉదాహరణను పరిగణనలోకి తీసుకుంటే, అల్యూమినియం సరఫరాదారు వద్ద వరదల నుంచి అంతరాయం వల్ల సమీప-కాల డెలివరీలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నప్పటికీ డిస్కౌంట్లు దిశాపరంగా పెరుగుతాయని యూబీఎస్ ఆశిస్తోంది.

స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

నిన్న భారీగా పెరిగిన బంగారం ధరలు.. నేడు స్వల్పంగా మాత్రమే తగ్గాయి. బుధవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.380 పెరగగా..నేడు రూ.100 మాత్రమే తగ్గింది. 24 క్యారెట్లపై నిన్న 410 పెరగ్గా.. ఈరోజు రూ.100 తగ్గింది. బులియన్ మార్కెట్‌లో గురువారం (సెప్టెంబర్ 12) 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.67,050గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.73,150గా నమోదైంది. తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలో ప్రధాన నగరాల్లో ఈ రోజు బంగారం ధరల గురించి తెలుసుకుందాం. హైదరాబాద్?లో నేడు 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,050గా.. 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ 10 గ్రాముల ధర రూ.73,150గా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని డిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,200గా.. 24 క్యారెట్ల ధర రూ. 73,300గా ఉంది. ముంబైలో ఈరోజు 22 క్యారెట్ల గోల్డ్ రూ.67,050గాను.. 24 క్యారెట్ల ధర రూ.73,150గాను ఉంది. బెంగళూరు, చెన్నై, కోల్?కతా, కేరళలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. మరోవైపు వెండి ధర దిగి వచ్చినట్లే దిగి వస్తూ.. మళ్ళీ పెరుగుతోంది. వరుసగా మూడు రోజులు పెరిగిన వెండి ధర.. నేడు స్థిరంగా ఉంది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.86,500గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో కిలో వెండి రూ.91,500గా కొనసాగుతోంది. అత్యల్పంగా బెంగళూరు కిలో వెండి రూ.84,000గా ఉంది.

30 కోట్ల నీరవ్ ఆస్తులు జప్తు

నీరవ్ మోదీకి చెందిన మరో రూ.29.75 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2 బిలియన్ డాలర్ల (డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి విలువలో దాదాపు రూ.17 వేల కోట్లు) పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన మేనమామ, రత్నాల వ్యాపారి మెహుల్ చోక్సీ సైతం కీలక నిందితుడే. ఇక ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ.. ఇప్పటిదాకా దేశ, విదేశాల్లోని రూ.2,596 కోట్ల విలువైన నీరవ్ ఆస్తుల్ని అటాచ్ చేసింది. కాగా, తాజా జప్తులో బ్యాంక్ డిపాజిట్లు, భూమి, భవనాలున్నట్టు ఓ ప్రకటనలో ఈడీ పేర్కొన్నది. పీఎన్‌బీ మోసం నేపథ్యంలో నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలు దేశం విడిచి పరారైపోగా.. నీరవ్ ఇప్పుడు బ్రిటన్ జైలులో ఉన్నాడు. అతని అప్పగింత కోసం ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ విశ్వ ప్రయత్నాలనే చేస్తున్నది. ముంబైలోని బ్రాడీ హౌజ్ పీఎన్‌బీ శాఖ కేంద్రంగా ఈ కుంభకోణం జరిగింది. బ్యాంక్ ఉన్నతాధికారులతో కలిసి నకిలీ/మోసపూరిత ఎల్‌వోయూలతో నీరవ్, చోక్సీలు వేల కోట్ల రుణాలను పొందారు. ఇక ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటిదాకా రూ.1,052.42 కోట్ల సొమ్మును పీఎన్‌బీ, ఇతర బ్యాంకులకు అప్పజెప్పినట్టు ఈడీ వర్గాలు చెప్తున్నాయి.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ విన్సర్ ఈవీ

దేశీయ విపణిలోకి జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తన విద్యుత్ కారు (ఈవీ) విన్సర్‌ను విడుదల చేసింది. ఈ కారు ధరలు రూ.9.99 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి. 38 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌ను ఒకసారి ఛార్జింగ్ చేస్తే, 331 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని, 40 నిమిషాల్లోనే పూర్తిగా ఛార్జింగ్ అవుతుందని కంపెనీ తెలిపింది. ఎకో, ఎకో ప్లస్, నార్మల్, స్పోర్ట్స్ మోడ్‌లు ఉన్నాయి. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (బీఏఏఎస్) కార్యక్రమాన్నీ సంస్థ ప్రారంభించింది. దీని కింద కిలోమీటరుకు రూ.3.5 చొప్పున చెల్లించేలా, బ్యాటరీని అద్దెకు తీసుకోవచ్చు. విన్సర్ బుకింగ్‌లు అక్టోబరు 3న ప్రారంభించి, 12 నుంచి డెలివరీలు ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. ఎంజీ మోటార్ ఇండియాలో జేఎస్‌డబ్ల్యూ వాటాలు కొన్నాక, విడుదల చేసిన తొలి ఈవీ ఇదే. ఇంతకుముందు విడుదల చేసిన జెడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీలకు భిన్నంగా మధ్య స్థాయి క్రాసోవర్ డిజైన్‌లో రూపొందించిన ఈ కారులో అత్యాధునిక ఫీచర్లతో పాటు ప్రయాణికులకు విశాలమైన స్పేస్ లభిస్తుందని కంపెనీ తెలిపింది. విన్సర్ ఈవీలో 18 అంగుళాల అలాయ్ వీల్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఫ్రంట్ ఛార్జింగ్ ఇంటెల్ లైట్లు, వెనక వైపు ఎల్ఈడీ టెయిల్ లైట్ యూనిట్లు అమర్చారు. 8.8 అంగుళాల డ్రైవర్ డిస్‌ప్లే, 15.6 అంగుళాల ప్రధాన ఇన్ఫోటెయిన్‌మెంట్ స్క్రీన్, లెవల్ 2 అడాస్, 360 డిగ్రీల కెమెరా, 6 ఎయిర్ బ్యాగులు ఉన్నాయి. సింగిల్ ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చారు. 134 బీహెచ్‌పీ శక్తిని, 200 ఎన్ఎం గరిష్ఠ టార్క్‌ను ఈ కారు అందిస్తుంది.

ఇండిగో ప్రత్యేక తగ్గింపు ఈ నెలాఖరు వరకే..

దేశంలో పండగల సందడి మొదలైంది. ఇప్పటికే వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. దసరా, దీపావళి కూడా త్వరలో రానున్నాయి. దూర ప్రాంతాలలో స్థిరపడిన వారు తమ సొంతూళ్లకు తిరిగి రానున్నారు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో కలిసి పండగలను జరుపుకోవడా నికి సిద్ధమవుతున్నారు. దూరప్రాంతాల నుంచి రావడానికి విమాన ప్రయాణం చాలా ఉపయోగంగా ఉంటుంది. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో విమాన టిక్కెట్ల బుక్కింగ్ లు కూడా జోరుగా జరుగుతున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణికుల కోసం యాడ్ ఆన్స్ ఫియస్టా అనే ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. పండగల నేపథ్యంలో ఇండిగో సంస్థ యాడ్ ఆన్స్ ఫియస్టా అనే ప్యాకేజీ ప్రకటించింది. దీని ద్వారా ప్రయాణికులు నెల రోజుల పాటు ఎంపిక చేసుకున్న ట్రావెల్ యాడ్ ఆన్‌లపై 20 శాతం తగ్గింపు పొందవచ్చు. పండుగలు, సెలవుల కోసం ఇంటికి వెళ్లే వ్యక్తులతో విమానయాన సంస్థలు సాధారణ రోజుల కంటే రద్దీగా ఉంటాయి. వారికి మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ ప్యాకేజీని అమలు చేస్తున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకూ విమానయాన సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్‌లు చేసుకుని ప్రయాణికులు ఈ ఆఫర్లను పొందవచ్చు. అదనపు బ్యాగేజీ, సీటు ఎంపిక, చెక్ ఇన్ లో ప్రాధాన్యత, భోజనం వంటి అనేక సేవలకు వర్తిస్తుంది.

స్పోర్ట్స్

భారత్-బంగ్లాదేశ్ టెస్ట్ సిరీస్‌లో ఈ రికార్డ్స్ బద్దలు కానున్నాయా?

సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ మ్యాచ్ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరగనుంది. రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ లోని గ్రీన్ పార్క్ లో జరగనుంది. తొలి మ్యాచ్‌కి టీమిండియాను ఇప్పటికే ప్రకటించారు. అయితే బంగ్లాదేశ్ ఇంకా జట్టును ప్రకటించలేదు. టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు జట్ల మధ్య భారత్‌దే పైచేయి. భారత్, బంగ్లాదేశ్ ల మధ్య మొత్తం 13 టెస్టు మ్యాచ్‌లు జరగగా అందులో భారత్ 11 మ్యాచ్‌లు గెలుపొందగా, రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇంత అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ, రోహిత్ మరియు బృందం బంగ్లాదేశ్‌ను తేలికగా తీసుకోవడానికి లేదు. దీనికి కారణం ఇటీవల బంగ్లాదేశ్ జట్టు 2-0తో పాకిస్థాన్‌ను ఓడించింది. తొలిసారిగా పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌ను బంగ్లాదేశ్ కైవసం చేసుకుంది. భారత్-బంగ్లాదేశ్ సిరీస్‌కి సంబంధించిన కొన్ని అద్భుతమైన రికార్డుల గురించి ఒకసారి చూద్దాం.. భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లి టెస్టు క్రికెట్‌లో మరో భారీ మైలురాయిని సాధించే దిశగా దూసుకుపోతున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో కోహ్లి 152 పరుగులు చేస్తే, టెస్టు క్రికెట్‌లో 9000 పరుగులు పూర్తి చేసిన నాలుగో భారత బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సునీల్ గవాస్కర్ వంటి దిగ్గజాల తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో భారత బ్యాట్స్‌మెన్‌గా విరాట్ కోహ్లి నిలవనున్నాడు. ప్రస్తుతం కోహ్లి 113 టెస్టుల్లో 8848 పరుగులు చేశాడు. భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మరో రికార్డుకు చేరువలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో రోహిత్ మరో 7 సిక్సర్లు బాదితే, టెస్టు క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాట్స్‌మెన్‌గా వీరేంద్ర సెహ్వాగ్ రికార్డును బద్దలు కొడతాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు ప్రస్తుతం వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. సెహ్వాగ్ 103 టెస్టుల్లో 90 సిక్సర్లు కొట్టాడు. ఇప్పటివరకు 54 టెస్టులాడిన రోహిత్ 84 సిక్సర్లు బాదాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ లో అత్యధిక సార్లు 5 వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచే ఛాన్స్ అశ్విన్ కు ఉంది. బంగ్లాదేశ్ తో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌లో అశ్విన్ 5 వికెట్లు తీస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక సార్లు ఈ ఫీట్ చేసిన బౌలర్ గా రికార్డులకెక్కనున్నాడు. ప్రస్తుతం అశ్విన్ ఆస్ట్రేలియా సీనియర్ స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్ తో సమానంగా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 10 సార్లు 5 వికెట్లు తీసుకున్న ఘనత సాధించారు. ఇందులో నంబర్-1గా ఉండాలనుకుంటే అశ్విన్ ఇంకా ఒక్కసారి మాత్రమే 5 వికెట్లు తీయాలి.

ఇంగ్లాండ్ క్రికెట్‌లో ఒకే ఒక్కడు..

సాధారణంగా ప్రొఫెషనల్ క్రికెట్లో టెస్ట్ ఫార్మాట్ తో పాటు వన్డే 20 ఫార్మాట్ అంటూ మూడు ఫార్మాట్లు ఉంటాయి అన్న విషయం తెలిసిందే. అయితే ఈ మూడు ఫార్మాట్లలో అతి కష్టమైన ఫార్మాట్ ఏది అంటే ప్రతి ఒక్కరు కూడా టెస్ట్ ఫార్మాట్ పేరుని చెబుతూ ఉంటారు. ఎందుకంటే సుదీర్ఘంగా సాగే మ్యాచ్ లలో ప్రతిసారి ఆటగాల్లకు ఒక అతిపెద్ద సవాలు ఎదురవుతూ ఉంటుంది. తమ ప్రతిభను ఎప్పటికప్పుడు కొత్తగా నిరూపించుకోవాల్సిన అవసరం ఉంటుంది అన్న విషయం తెలిసిందే. అందుకే సాంప్రదాయమైన క్రికెట్ గా పిలుచుకునే టెస్టు ఫార్మాట్లో కేవలం కొంతమంది ఆటగాళ్లు మాత్రమే సక్సెస్ అవ్వడం చూస్తూ ఉంటాము అయితే టెస్ట్ ఫార్మాట్లో రాణించడమే గొప్ప విషయంగా అందరూ భావిస్తూ ఉంటారు. ఇక ఎవరైనా ఆటగాడు ఇక మంచి ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్నారు అంటే అతనిపై అందరూ ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు. అలాంటిది ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకోవడంలో కూడా రికార్డు సృష్టిస్తే.. ఇక అది ఎంత అరుదైన ఘనత అవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇక ఇప్పుడు ఇంగ్లాండ్ ప్లేయర్ రూట్ ఇలాంటి రికార్డును సృష్టించాడు. ఇంగ్లాండ్ జట్టులో స్టార్ ప్లేయర్గా కొనసాగుతున్న జో రూట్ ఒక అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ ఫార్మాట్లో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకున్న 9వ క్రికెటర్ గా నిలిచాడు. ఇప్పుడు వరకు అతను ఏకంగా ఆరు ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డులను అందుకున్నాడు. అంతేకాకుండా ఇంగ్లాండ్ తరపున అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకున్న తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. ఇతని తర్వాత గ్రహం గూచ్, ఆండ్రూ స్ట్రాస్, జేమ్స్ అండర్సన్ ఐదు సార్లు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందుకొని ఈ లిస్టులో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

నా దృష్టిలో అతనే బెస్ట్ బ్యాటర్

సాదరణంగా సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోలుగా కొనసాగుతున్న వారికి కోట్లాదిమంది అభిమానులు ఉంటారు. తమ అభిమాన హీరోని మించిన వారు లేరు అని చెప్పుకుంటూ ఉంటారు. అయితే ఇలా స్టార్ హీరోలుగా కొనసాగుతున్న వారు సైతం ఇక ఇండస్ట్రీలో ఉన్న మిగతా హీరోలకు అభిమానులుగా కొనసాగుతూ ఉంటారు. ఇలాంటి విషయాలు అప్పుడప్పుడు బయటకి వస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారిపోతూ ఉంటాయి అని చెప్పాలి. అయితే అచ్చంగా ఇలాగే క్రికెట్లో స్టార్ ప్లేయర్లుగా కొనసాగుతున్న వారికి సైతం ఫేవరెట్ ప్లేయర్లు ఉంటారు. ఇక అప్పుడప్పుడు పలు ఇంటర్వ్యూలలో ఆయా స్టార్ ప్లేయర్లు తమ ఫేవరెట్ ప్లేయర్లు ఎవరు అన్న చెప్పడం.. ఇక సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారిపోవడం జరుగుతూ ఉంటుంది. ఇక ఇటీవల టీమిండియాలో స్టార్ ప్లేయర్ గా కొనసాగుతున్న కేఎల్ రాహుల్ సైతం తన ఉద్దేశం ప్రకారం బెస్ట్ బ్యాటర్ ఎవరు అన్న విషయాన్ని చెప్పుకొచ్చాడు.సాదరణంగా కేఎల్ రాహుల్ ఇక బెస్ట్ బ్యాటర్ ఎవరు అని ప్రశ్న వస్తే రోహిత్ పేరు చెబుతాడని అందరూ అనుకుంటారు. కానీ రోహిత్ కాకుండా విరాట్ కోహ్లీ పేరునూ చెప్పాడు. ఇక విరాట్ కోహ్లీ కూడా ప్రస్తుతం వరల్డ్ క్రికెట్లో లెజెండరీ ప్లేయర్ గా కొనసాగుతూ ఉన్నాడు. అనే విషయం తెలిసిందే. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కేఎల్ రాహుల్ తన దృష్టిలో విరాట్ కోహ్లీ బెస్ట్ బ్యాట్స్మెన్ అంటూ చెప్పుకొచ్చాడు. బౌలర్లలో డైల్ స్టేయిన్ ఆడటం చాలా కష్టం అంటూ తెలిపారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సూర్య కుమార్ యాదవ్, బాబర్ ఆజాం, ట్రావీస్ హెడ్ లు ప్రస్తుతం క్రికెట్లో ఉన్న అత్యుత్తమ ప్లేయర్లు అంటూ చెప్పుకొచ్చాడు. బౌలర్లలో స్టేయిన్, బూమ్రా, అండర్సన్, రషీద్ ఖాన్, నసీంషాలు అత్యుత్తమ ప్లేయర్లు అంటూ చెప్పుకొచ్చాడు కేఎల్ రాహుల్.

దెయ్యం సినిమాలో పూజా హెగ్డే

ఒకే కథను అటుఇటు మార్చి చూపిస్తారని కాంచన సిరీస్ మీద కామెంట్స్ ఉన్నా సరే దానికున్న కమర్షియల్ వేల్యూ పెద్దది. మూడో భాగం మీద యునానిమస్ గా నెగటివ్ టాక్ వచ్చినా మాస్ అండతో తెలుగులోనూ లాభాలు ఇచ్చిన ప్రాజెక్టుగా మిగిలిపోయింది.మునితో ఈ పరంపర మొదలుపెట్టిన లారెన్స్ ని తర్వాత ఎందరో దర్శకులు తన రూట్ ఫాలో అయిపోయి సూపర్ హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు కాంచన 4కి రంగం సిద్ధమవుతోంది. ప్రముఖ బాలీవుడ్ సంస్థ గోల్డ్ మైన్స్ దీని మీద 100 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టేందుకు రెడీ అయ్యిందని సమాచారం. స్క్రిప్ట్ వర్క్ సిద్ధం చేసుకుని ప్రీ ప్రొడక్షన్ లో ఉన్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే కాంచన 4లో హీరోయిన్ గా పూజా హెగ్డేని దాదాపుగా తీసుకున్నట్టేనని చెన్నై టాక్. ఇప్పటిదాకా తను హారర్ జానర్ లో నటించలేదు. రెండేళ్ల క్రితం తెలుగు, తమిళంలో వరస డిజాస్టర్లు పలకరించేసరికి హిందీ అవకాశాల మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది. సల్మాన్ ఖాన్ తో ఏరికోరి చేసిన కిసీకా భాయ్ కిసీకా జాన్ దారుణంగా పోయింది. ఇక రాధే శ్యామ్, ఆచార్య, బీస్ట్ గురించి తెలిసిందే. అల వైకుంఠపురములో ఇచ్చిన సక్సెస్ కిక్ ఆ తర్వాత కొనసాగలేదు. ప్రస్తుతం షాహిద్ కపూర్ దేవాతో పాటు సూర్య – కార్తీక్ సుబ్బరాజ్ కాంబో మూవీలు తన చేతిలో ఉన్నాయి. లారెన్స్ కు ఓకే చెబితే కొత్త రూట్ తీసుకున్నట్టు అవుతుంది. అయినా ఈ మధ్య దెయ్యాల సినిమాల పట్ల గ్లామర్ హీరోయి న్లు ఆసక్తి చూపిస్తున్నారు. రాశిఖన్నా, తమన్నా, త్రిష, హన్సిక ఇలా అందరూ ట్రై చేసి హిట్లు కొట్టినవాళ్ళే. ఎంత హారర్ అయినా సరే అందమైన భామలను తీసుకుని సినిమాకు గ్లామర్ టచ్ ఇచ్చే లారెన్స్ ఈసారి కూడా అదే చేయబోతు న్నాడు. చంద్రముఖి 2 ఘోరంగా డిజాస్టర్ అయినా ఈసారి తన స్వీయ దర్శకత్వంలో బలమైన కంబ్యాక్ ఇవ్వాలని ఎదురు చూస్తున్నాడు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనా రాలేదు కాని త్వరలో ఆ లాంఛనం ఉండొచ్చు.

మరో బిజినెస్‌లోకి మహేశ్!

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ స్టార్లలో ఒకడు మహేశ్ బాబు ఈ స్టార్ యాక్టర్ ఓ వైపు సినిమాలతో ఎంటర్‌టైన్ చేస్తూనే.. మరోవైపు పలు బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నాడని తెలిసిందే. ఇప్పటికే మహేశ్ బాబు ఖాతాలో క్లాతింగ్ బ్రాండ్, మల్టీప్లెక్స్ బిజినెస్, రెస్టారెంట్ ఉన్నాయి. తాజాగా మహేశ్‌బాబు మరో వ్యాపారంలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడనే వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏంటనే కదా మీ డౌటు.. వెల్‌నెస్ బ్రాండ్ ఫిట్ డే బిజినెస్. హైదరాబాద్‌కు చెందిన ఈ స్టార్టప్ కంపెనీలో మహేశ్ బాబు పెట్టుబడులు పెట్టనున్నట్టు ఫిలిం నగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. తాజా సమాచారం ప్రకారం ఫిట్ డే పోషకాహార విలువలు కలిగిన హెల్త్ సప్లిమెంట్స్ ప్రోటీన్, చిప్స్, ప్రోటీన్ బార్ లాంటి ఉత్పత్తులను అమ్మనుంది. ఇదిలా ఉంటే మహేశ్ బాబు ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో ఎస్ఎస్ఎంబీ 29 చేస్తున్నాడని తెలిసిందే. గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా రాబోతున్న ఈ చిత్రం 2025 జనవరిలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.ఓ వైపు ప్రొఫెషనల్‌గా ఫుల్ బిజీగా ఉంటూనే.. మరోవైపు మల్టీపుల్ బిజినెస్ ప్లాన్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు మహేశ్ బాబు.

'సత్యం సుందరం' అంత సీన్ ఉందా

సెప్టెంబర్ 27 దేవర విడుదల కోసం బయ్యర్లు, ప్రేక్షకుల్లో ఎంత హైప్ ఉందో తెలిసిందే. అందుకే దానికి వారం ముందు తర్వాత వీలైనంత తమ కొత్త సినిమాల రిలీజ్ లేకుండా నిర్మాతలు జాగ్రత్త పడుతున్నారు.కానీ కార్తీ మాత్రం ఏకంగా ఫేస్ టు ఫేస్ క్లాష్ కు సిద్ధపడుతున్నాడు. తన తాజా చిత్రం మెయిజగన్ ని తెలుగులో సత్యం సుందరం పేరుతో డబ్బింగ్ చేసి దేవర వస్తున్న రోజే థియేటర్లకు తీసుకొస్తున్నారు. సురేష్ ఏషియన్ పంపిణి కావడంతో చెప్పుకోదగ్గ థియేటర్లే దొరుకుతాయి. ఖైదీ నుంచి కార్తీకి మన దగ్గర మంచి మార్కెటే ఏర్పడింది. ప్రత్యేకంగా అభిమానులు కూడా ఉన్నారు. అయితే దేవరతో తలపడేంత సీన్ సత్యం సుందరంకు ఉందా అనేదే ప్రశ్న. అలాని ఇదేదో ఆషామాషీ బొమ్మ కాదు. విజయ్ సేతుపతి త్రిషలతో 96 రూపంలో ఎవర్ గ్రీన్ క్లాసిక్ ఇచ్చిన ప్రేమ్ కుమార్ దీనికి దర్శకుడు. ఆయనే శర్వానంద్ సమంతాతో రీమేక్ చేశారు కానీ మన ఆడియన్స్ తిరస్కరించడం వేరే విషయం. అయితే సత్యం సుందరం విషయంలో ప్రేమ్ కుమార్ చాలా ధీమాగా ఉన్నాడు. అరవింద్ స్వామి మరో కీలక పాత్ర పోషించిన ఈ విలేజ్ డ్రామా కథ మొత్తం ఒకే రాత్రిలో జరుగుతుందట. ఊహించని చాలా అంశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయని అంటున్నారు. ఇంకో వారంలో దీనికి సంబంధించిన ప్రమోషన్లను హైదరాబాద్ లో మొదలుపెట్టబోతున్నారు. దేవర ఫీవర్ లో సత్యం సుందరం నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. కంటెంట్ బాగుండొచ్చు కానీ అంత పెద్ద మాస్ మూవీతో తలపడటం ఎంతైనా రిస్కే. మన సంగతి కాసేపు పక్కనపెడితే తమిళనాడులో దేవర స్క్రీన్లకు ఈ సత్యం సుందరం ఒరిజినల్ వెర్షన్ కొన్ని కోత వేయడం ఖాయం.

బాలీవుడ్లో తారక్ బడా ప్లానింగే

'బాహుబలి'తో ప్రభాస్ సాధించిన స్టార్ ఇమేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్, మార్కెట్‌ను ఇంకెవ్వరూ మ్యాచ్ చేయలేరన్నది వాస్తవం. కానీ ఆ స్థాయిలో కాకపోయినా 'ఆర్ఆర్ఆర్'తో జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్‌ల ఇమేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్, మార్కెట్ కూడా ఎంతగానో పెరిగాయన్నది వాస్తవం. ఆ విషయంలో తారక్, చరణ్‌ల తర్వాతి సినిమాల విషయంలో స్పష్టంగా కనిపిస్తోంది. తారక్ విషయానికి వస్తే.. 'ర్ఆర్ఆర్ తర్వాత వస్తున్న 'దేవర'కు పాన్ ఇండియా స్థాయిలో మంచి హైప్ వచ్చింది. దీని బడ్జెట్, బిజినెస్ అన్నీ కూడా వేరే లెవెల్లో కనిపిస్తున్నాయి. రేప్పొద్దున సినిమాకు వచ్చే ఓపెనింగ్స్ కూడా అందుకు తగ్గట్లే ఉండొచ్చనడంలో సందేహం లేదు. ఇదే సమయంలో పాన్ ఇండియా స్థాయిలో మరింతగా తన మార్కెట్‌ను విస్తరించే దిశగా ప్రణాళిక ప్రకారం అడుగులు వేస్తున్నాడు తారక్. 'కేజీఎఫ్'బీ 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో సినిమా అంటే పాన్ ఇండియా స్థాయిలో పెద్ద రేంజిలోనే ఉంటుంది. మరోవైపు నేరుగా బాలీవుడ్లో హృతిక్ రోషన్‌తో కలిసి 'వార్-2' చేస్తున్నాడు తారక్. అది జూనియర్ కెరీర్లో ఒక కీలక మలుపు అవుతుందని భావిస్తున్నారు. మరోవైపు 'దేవర' చిత్రాన్ని హిందీలో రిలీజ్ చేస్తున్న కరణ్ జోహార్ సైతం తారక్‌తో నేరుగా ఓ సినిమా చేయడానికి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. నిన్న ముంబయిలో 'దేవర' ట్రైలర్ లాంచ్ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని చెప్పకనే చెప్పాడు. తారక్ తనకు బాగా క్లోజ్ అని చెబుతూ.. తమ ప్రయాణం ఇప్పుడే మొదలైందని, మున్ముందు చాలా చూస్తారని చెబుతూ.. తాను దేని గురించి మాట్లాడుతున్నానో తారక్‌కు కూడా తెలుసు అంటూ తమ కలయికలో ఓ సినిమా రాబోతున్న విషయాన్ని చూచాయిగా చెప్పాడు.

దేవర గేమ్ ఆఫ్ థ్రోన్స్ కంటే పెద్దది

కళ్యాణ్ రామ్ కామెంట్స్ వైరల్

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ యాక్టర్లలో ఒకడు నందమూరి కళ్యాణ్ రామ్. ఓ వైపు నటుడిగా.. మరోవైపు నిర్మాతగా కొనసాగుతూ సక్సెస్‌ఫుల్‌గా కెరీర్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ స్టార్ యాక్టర్ వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న చిత్రం దేవర జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. కొరటాల శివ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో తారక్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. కాగా కళ్యాణ్ రామ్ దేవర గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. నాకు దేవర గేమ్ ఆఫ్ థ్రోన్స్ (పాపులర్ ఇంగ్లీష్ సిరీస్) కంటే పెద్దది. దేవర భారతీయ సిల్వర్ స్క్రీన్‌పై ఉత్తమంగా ఉంటుంది. ఈ సినిమా కోసం మేమంతా 40 అడుగుల లోతులో ట్యాంక్‌ను తవ్వి.. నీటి అడుగుభాగంలో వచ్చే సన్నివేశాలను చాలా విస్తృతంగా చిత్రీకరించాము. గత ఏడాది కాలంగా దేవర తప్ప మరే సినిమాలో పని చేయని సాబు సిరిల్ వేసిన సెట్‌పీస్ చూస్తే మీరతా ఆశ్చర్యపోతారు. తమ్ముడు జూనియర్ ఎన్టీఆర్ కష్టం దేవర సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లిందంటూ చెప్పుకొచ్చాడు. దేవరలో సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తున్నాడు. జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918